ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 4 సెప్టెంబరు 2024 | 5

రూ.10 లక్షల విలువైన మందులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం నుంచి మంగళవారం రూ.10 లక్షల విలువైన మెడిసిన్స్‌ను ఒక ప్రత్యేక వాహనంలో పంపించారు. డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి మందులతో వెళుతున్న వాహనాన్ని పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ తరపున రాజమహేంద్రవరం టౌన్ అసోసియేషన్ నాయకులు మందులు సేకరించినట్టు అధ్యక్షుడు పిల్లా బాల తెలిపారు.


విజయవాడలో వరద బాధితుల సమస్యలు వింటున్న మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల


కొవ్వూరు నుంచి వెళుతున్న ఆహార వ్యాన్లకు సిగ్నల్ ఇస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఆహా.. ఏమి స్పందన

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రార్థించే పెదవులకన్నా.. సాయం చేసే చేతులు మిన్న.. ప్రస్తుతం జిల్లా వాసులంతా ఈ నానుడి పాటిస్తున్నారు. విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి అనేక మంది స్వచ్ఛందంగా సాయం చేస్తున్నారు.తొలిరోజు సోమవారం 16 వాహనాల్లో ఆహారం తలించగా.రెండోరోజు మంగళవారం జిల్లా నుంచి 58 వాహనాల్లో 1,09,500 ఫుడ్ ప్యాకెట్లు పంపినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం భోజనం కోసం 53 వేల మందికి 20 వాహనాల్లో ఆహారాన్ని పంపించామన్నారు.రాత్రి భోజనం కోసం 56,500 ఫుడ్ ప్యాకెట్లు పంపించినట్టు చెప్పారు. ఉదయం భోజనం కోసం తిరుమల స్కూల్స్ 10 వేల ప్యాకెట్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా 12,500 ప్యాకెట్లు, గైట్ కళాశాల ద్వారా 1500, జీఎస్ఎల్ ద్వారా 2500, సినిమా అసోసియేషన్ తరపున 1000, ఓఎన్‌జీసీ తరపున 5000,ఇస్కాన్ 5000, రాజమహేంద్రవరం కార్పొరేషన్ కాంట్రాక్టర్లు 1000 ఫుడ్ ప్యాకెట్లు,50 వేల బిస్కట్ ప్యాకెట్లు పంపించారు.రాత్రి భోజనం కోసం ఆదిత్య కాలేజీ 500 ప్యాకెట్లు, ప్రైవేట్ పాఠశాలలు 5000, రాజమ హేంద్రవరం ఆర్డీవో ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ల ద్వారా 20,000 ప్యాకెట్లు, ఐఎంఏ అసోసియేషన్ 2000, పెట్రోలు బంకుల అసోసియేషన్ 1500, లెనోరా డెంటల్ కాలేజీ, ఇండస్ట్రీస్ 1500, విమెన్ కాలేజీ 1000, హార్లిక్స్ ఫ్యాక్టరీ ద్వారా 7000 పంపిణీ చేశారు. ఎస్ఆర్‌కే కేటరింగ్ 7000 ప్యాకెట్లు, హోటల్ శ్రీకన్య 10 వేల ప్యాకెట్లు, కొవ్వూరుకు చెందిన సీహెచ్ వెంకటరమణ 5000, ప్రసాద్ కేటరింగ్ 5000 ప్యాకెట్లు పంపిణీ చేశారు.



మేం సైతం : ఎమ్మెల్యేలు మద్దిపాటి, ముప్పిడి సాయం


నేనూ..వండేస్తా : ఎమ్మెల్యే బత్తుల


మా వంతుగా : విజయవాడ తరలిస్తున్న మందులు


పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆహార వ్యాన్



మేమంతా సిద్ధం వెళ్లిపోవడానికి!

ఫ్యాన్ కింద తీవ్ర ఉక్కబోత

- ఓటమి తరువాత కానరాని నేతలు
- ఇతర పార్టీల వైపు కేడర్ చూపు
- పార్టీ పిలిచినా స్పందించని వైనం
- 7 అసెంబ్లీల్లో ఇదే పరిస్థితి
- యువజన విభాగానికి రాజా
- జిల్లా అధ్యక్షుడిగా వేణు
- తూర్పున ఖాళీ అవుతున్న వైసీపీ
- మళ్లీ పుంజుకుంటున్న కాంగ్రెస్


ఆగండి..ఆగండి.. మేమూ వచ్చేస్తాం..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత జిల్లాలో వైసీపీ పరిస్థితి చుక్కానిలేని నావలా తయారైంది. మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లన్నీ టీడీపీ కూటమి కైవసం చేసుకోవడంతో వైసీపీ కుదేలైంది. పైగా భారీ ఓట్ల తేడాతో వైసీపీ నేతలు ఓడిపోయారు. దీంతో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వైసీపీలో ఉంటే ఇబ్బందులేననే ఆలోచనతో క్యాడర్ ఉంది.ఈ నేపథ్యంలో పలువురు నేతలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పుంజుకోవడం కోసం వైసీపీ వర్గాలపై కన్నేసింది. చాలా కాలం నుంచి కాంగ్రెస్ అనుచరులుగా ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన నేతలంతా మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. టీడీపీ,జనసేన, బీజేపీలోకి రావడానికి పైరవీలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా సాగుతున్నా వైసీపీ కేడర్‌ను కాపాడుకునే పని చేయడం లేదు. అధికారంలో ఉండగా వైసీపీ కేడర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇవాళ అనేక మంది వైసీపీని వదిలేయడానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం కేడర్ అంతా ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లాలో పలువురు వైసీపీని వదిలేసి ఇతర పార్టీల పంచన చేరుతున్నారు. కూటమికి చెందిన ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ నిడదవోలులో గ్రీన్ సిగ్నల్ ఇస్తే చాలా మంది పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. గోపాలపురం నియోజకవర్గంలో వైసీపీ పూర్తిగా చతికిలపడింది. మాజీ మంత్రి తానేటి వనిత అప్పుడప్పుడు అలా కనిపించడం తప్ప కేడర్‌ను నడిపించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొవ్వూరులో కింగ్ మేకర్‌గా ఉన్న రాజీవ్‌కృష్ణ ఇటీవల యాక్టివ్‌గా కనిపించడంలేదు.అక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజల్లోకి రావడం లేదు.రాజమహేంద్రవరం సిటీలో మాజీ ఎంపీ భరత్ అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు పెట్టి, అధికార పార్టీని ఆడిపోసుకోవడానికే పరిమితం అవుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరిస్థితి కూడా అంతే. ఎన్నికల ముందు రామచంద్రపురం నుంచి ఇక్కడకు వలస వచ్చిన వేణు ఓటమి తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. రాజానగరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన వైపు నిలబడడానికి కూడా పెద్దగా కేడర్ ఆసక్తి చూపడం లేదు. పైగా ఆయన జిల్లా అధ్యక్ష పదవిని వదిలేసి, రాష్ట్ర వైసీపీ యువజన విభాగం అధ్యక్ష పదవిని చేపట్టారు.దీంతో ఆయనకు ఇక్కడ బాధ్యత తగ్గినట్టే. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి పరామర్శలకే పరిమితం అయ్యారు. నేతల పరిస్థితి ఇలా ఉంటే జిల్లా లో వైసీపీ నేతల మధ్య విభేధాలు తారాస్థాయికి చేరాయి.ఇదిలా ఉండగా జిల్లా అధ్యక్ష పదవిని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు కట్టబెట్టారు. అయితే ఆయన కోనసీమ జిల్లాకు చెందిన నేత కావడంతో కేడర్‌లో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం సిటీ ప్రెసిడెంట్‌గా మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను నియమించారు. ఇదిలా ఉండగా పార్టీ ఫిరాయించడానికి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ,జడ్పీటీసీలు, కౌన్సిలర్లు సిద్ధంగా ఉండడం గమనార్హం.

ఫీవర్..ఫియర్

- పెరుగుతున్న జ్వర పీడితులు
- ప్రజలను వీడని వైరల్ జ్వరాలు
- శిబిరాలు పెట్టినా ఫలితం నిల్
- ఫీవర్ సర్వేపై పెదవి విరుపు
- జీజీహెచ్‌లో 53 జ్వరం కేసులు
- పిల్లలకూ సోకుతున్న వైనం
- 'లెక్కలేని' ప్రైవేట్ ఆసుపత్రులు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఆరోగ్యపరంగా, ఆర్థికంగానూ పీల్చిపిప్పి చేస్తున్నాయి. సామాన్యులు, దిగువ మధ్యతరగతి ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. పెద్దలతో పాటు పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. సాధారణ వైరల్‌తో పాటు డెంగీ, మలేరియా జ్వరాలు నమోదవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వరబాధితులతో నిండిపోతున్నాయి. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితర ఆరోగ్య సిబ్బంది చేసిన ఫీవర్ సర్వేపై ప్రజల్లో అనేక అనుమానాలు ఏర్పడుతున్నాయి.లెక్క తప్పుతున్నదనే ఆరోపణలున్నాయి.

సర్వేల్లో.. ఫీవర్ జీరో..

రాజమహేంద్రవరం అర్బన్, కొవ్వూరు ప్రాంతాల్లో 15 చోట్ల మంగళవారం ఫీవర్ సర్వేలు నిర్వహించామని వైద్య, ఆరోగ్యశాఖ ప్రకటించింది. కొవ్వూరులోని శ్రీరామకాలనీ, గోష్పాదక్షేత్రం, రాజమహేంద్రవరం సిటీలో వెంకటేశ్వరనగర్, సుభాష్‌నగర్, శేషయ్యమెట్ట, నెహ్రూనగర్ గజ్జలమ్మ టెంపుల్ స్ట్రీట్, ఇన్నీసుపేట, మునిసిపల్ కల్యాణ మండపం, బ్రహ్మంగారి గుడి వీధి, మల్లిన నగర్ పోస్టల్ కాలనీ వంటి ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు వెల్లడించారు. ఇలా ప్రతిరోజూ ఆరోగ్య సిబ్బంది ఫీవర్‌సర్వే చేస్తున్నారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఈ నెల 2వ తేదీన ఆరోగ్య సిబ్బంది 51,519 కుటుంబాల్లో లక్షా 53 వేల 506 మందిని సర్వే చేశారు. వీరిలో 2,816 మందిని ఓపీగా గుర్తించగా 234 అనుమానిత కేసులు నమోదయ్యాయి. వీరిలో 99 మందికి డెంగీ పరీక్షలు చేస్తే నెగెటివ్ వచ్చింది.మరో 159 మందికి మలేరియా జ్వరాలపై పరీక్షలు చేయగా నెగెటివ్‌గా తేలింది.ఈ లెక్కన ఎవరికి జ్వరం అనేదే లేదని తేల్చారు. మరి ప్రజలు జ్వరాలతో పెద్దసంఖ్యలో ఆసుపత్రుల్లో ఎందుకు చేరుతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

జీజీహెచ్ జ్వరాల ఓపీ 53..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు జ్వరపీడితులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పిల్లల్లోనూ జ్వరాలు కనిపిస్తున్నాయి. మంగళవారం జీజీహెచ్‌లో పెద్దలకు సంబంధించిన జ్వరాల ఓపీ 53గా నమోదు కావడం గమనార్హం.అధికారులు చెబుతున్నదాని ప్రకారం ఇక్కడ ఇన్‌పేషెంట్లుగా 9 మంది చికిత్స పొందుతున్నారు. ఇద్దరు చిన్నారులు జ్వరాలతో ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. కానీ వాస్తవాలు మరోలా కనిపిస్తున్నాయి. ఆసుపత్రిలో బెడ్స్ చాలకపోవడంతో ఎక్కువ మందికి ఓపీ విభాగంలో వైద్య సేవలు అందించి మందులు రాసి ఇళ్లకు పంపుతున్నారనే ప్రచారం సాగుతోంది. సగటున 10-12 మందిని మాత్రమే ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నారని, దీనికోసం పాతవారికి డిశ్చార్జ్ రాస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక జ్వరాలతో ప్రజలు పెద్దసంఖ్యలో వస్తున్నా జీజీహెచ్‌లో ఫీవర్‌వార్డు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. జీజీహెచ్‌కు వైరల్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలతో వస్తున్నవారికి జీజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు వైద్యసేవలందిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో 'లెక్కలేనట్టే'..

జ్వరాలకు సంబంధించిన సమాచారం అంతోఇంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తున్నా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లోని లెక్కలపై ఎలాంటి స్పష్టత ఉండడంలేదు. ఆర్ఎంపీలు, పీఎంపీల నుంచి లెక్కలు రావడంలేదు. జ్వరాల ఓపీ ఎంత ? వాటిలో వైరల్ ఎన్ని ? డెంగ్యూ, మలేరియా అనుమానితుల సంఖ్య ఎంత అనేదానిపై ప్రైవేట్ ఆసుపత్రులు జిల్లా అధికారులకు పూర్తి సమగ్ర సమాచారం ఇవ్వడంలేదనే అనుమానాలున్నాయి. దీంతో వైరల్, డెంగీ, మలేరియా, తదితర జ్వరాల లెక్కలపై పూర్తి లెక్క తేలడంలేదు.దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.



బదిలీల.. బండారం!

ఎడాపెడా సిఫారసు లేఖలు

- బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఈ నెల 15 వరకు గడువు
- క్యూకడుతున్న ఉద్యోగులు
- గత 20 రోజులుగా ఇదే సీన్
- డిమాండ్ ఉన్న సీటుకు రేటు
- అయినా తగ్గని వైనం
- ఎక్సయిజ్‌కు మహా డిమాండ్
- వైసీపీ లేఖలకు వత్తాసు
- మారని అధికారుల తీరు

బదిలీల జాతర ఆరంభమైంది..ఆ సీటు నాకు కావాలంటే.. నాకు కావాలంటూ ఉద్యోగులు పోటీ పడుతున్నారు... డిమాండ్‌ను బట్టి సీటులో కూర్చునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.. ముందస్తుగా ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రయత్నాలు చేస్తున్నారు.. మీరు ఒక లెటర్ ఇవ్వండి సార్.. మిగిలిందంతా మేం చూసుకుంటామంటూ ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.. అదీ కుదరకపోతే సీటు కొనుగోలుకు సిద్ధపడుతున్నారు.. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వంలోనూ అక్కడక్కడా వైసీపీ నాయకుల సిఫారసులకు అధికారులు ప్రాధాన్యమివ్వడం కొసమెరుపు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసీపీ అక్రమాలకు కొమ్ముకాస్తూ ప్రజాస్వామ్యానికే ఇబ్బందిగా పరిణమించిన అధికారులను ఆయా పోస్టుల నుంచి తప్పించింది. తొలుతగా రాష్ట్ర స్థాయి అధికారులతో మొదలుపెట్టి జిల్లా స్థాయిలోనూ బదిలీలు జరిగాయి. తర్వాత మండల ఆ క్రింది స్థాయి వంతు వచ్చింది. దీంతో అసలైన బదిలీల గోల మొదలైంది. ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు రెక్కలొచ్చాయి. కలెక్టర్ వద్దకు వస్తున్న ఉద్యోగుల్లో ఎవరి చేతిలో చూసినా ఓ కవరు ఉండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

బదిలీలకు 11 రోజులే గడువు

బదిలీలకు అనుమతి ఇచ్చిన వెంటనే ఎవరి ప్రయత్నాలు వారు ఆరంభించారు. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు 'ఖర్చు' పెడుతున్నారు. తమకు లేఖ ఇస్తే తర్వాత సంగతి తాము చూసుకుంటామని చెప్పడంతో ప్రజాప్రతినిధులు ఒకరికంటే ఎక్కువ మందికి సిఫారసు లేఖలు ఇస్తున్నారు. గత 15 రోజుల నుంచీ ఇదో జాతర మాదిరిగా జరుగుతోంది. గత నెల 31వ తేదీ వరకు బదిలీల దరఖాస్తులకు ముగింపు గడువు ఇచ్చారు. అయితే అధికారుల అభ్యర్థన మేరకు మరో 15 రోజులు పెంచుతూ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీల దరఖాస్తు గడువుకు ఇంకా 11 రోజులే మిగిలి ఉండడంతో సిఫారసు లేఖలు ముమ్మరమయ్యాయి. సిఫారసు లేఖలు తీసుకున్న వాళ్లు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్నారు. అయితే వైసీపీ వేధింపులకు తాళలేక లేక వేరే కారణాలతో లూప్‌లైనులో ఉన్న వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని కొందరు ఉద్యోగులు కోరుతున్నారు. లూప్‌లైనులో ఉన్నవారు, నిజాయితీగా పని చేసే వాళ్లు డబ్బు ఖర్చుచేసి సిఫారసు లేఖలు సంపాదించడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందట్లో సడేమియాగా వైసీపీ అనుకూల వర్గం వాళ్లు కూడా సిఫారసు లేఖలు సమర్పించి కావాల్సిన పోస్టింగ్ తెచ్చుకొనే పనిలో ఉన్నారనే వాదన ఉంది. డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్‌పై ఆరోపణల నేపథ్యంలో రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు తిరస్కరించినప్పటికీ వైసీపీ నేతల ప్రోద్బలంతో బదిలీని నిలుపుదల చేసుకుని కొనసాగుతుండడమే ఇందుకు నిదర్శనం.

జీవో ఏం చెబుతుందంటే?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బదిలీలకు అనుమతినిస్తూ గత నెల 17న జీవో ఎంఎస్ నెం.75ని విడుదల చేసింది. రెవెన్యూ(భూ పరిపాలన), పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్, సెర్ప్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, జీపీడబ్ల్యువీ అండ్ వీ ఎస్‌డబ్ల్యుఎస్(సచివాలయాలు), మైనింగ్, అన్ని శాఖల్లోని ఇంజనీరింగ్ సిబ్బంది, దేవాదాయ, రవాణా,ఈఎఫ్ఎస్అండ్‌టీ, పరిశ్రమలు,ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, వాణిజ్య పన్నులు, అబ్కారీ శా ఖల్లో బదిలీలకు అనుమతి ఇచ్చారు. బదిలీలు ఆగస్టు 19 నుంచి సెప్టెంబరు 15వ తేదీలోపుగా పూర్తి చేయాలని పేర్కొన్నా రు. ఎక్సైజ్ శాఖకు సెప్టెంబరు 5 నుంచి 15 వర కూ సమయమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలో బదిలీల విధి విధానాలు స్పష్టంగా పేర్కొన్నారు. ఆయా శాఖలు అం తర్గతంగా కమిటీలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వడపోత తర్వాత కాంపిటెంట్ అథారిటీకి సిఫారసు చేయాలని జీవోలోని 5(3) పేరా చెబుతోంది. బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని 5(4)లో పేర్కొన్నారు. ఒకవేళ అవకతవకలు జరిగాయని తేలితే ఆయా శాఖాధిపతులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కానీ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, రవాణా, ఎనర్జీ, మైనింగ్ శాఖలో ఈ లేఖల గోల ఎక్కువగా ఉందని చెబుతున్నారు. బదిలీలు చేయించుకోడానికి కొందరు ఖర్చు చేస్తుంటే..మరి కొందరు బదిలీని ఆపుకోడానికి తంటాలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు వచ్చే నెల 5 నుంచి తలుపులు తెరుచుకోనుండడంతో ఇప్పటి నుంచే ఆ శాఖ ఉద్యోగులు 'ప్రయత్నాలు' మొదలు పెట్టి నట్టు చెబుతున్నారు. ఆ శాఖకు ప్రభుత్వం పునర్ వైభవం తీసుకొస్తుండడంతో ఎంత 'ఖర్చు'కైనా సిద్ధమయ్యారట. ఇప్పటికే లేఖలు పుచ్చుకున్న వారిని ఆరా తీస్తే దుడ్డు సర్దుబాటుచేసుకొనే పనిలో తలమునకలయ్యారట.

మిడ్‌డే మీల్స్ రుచిగా ఉండాలి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, సెప్టెంబరు 3 : ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహించిన జిల్లాస్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చూడాలన్నారు. బడి భోజనం మెనూలో మార్పులు ఉంటే చర్చించి నివేదిక అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం అందజేస్తుందని తెలిపారు. వారానికి 5 రోజులు ఉడికించిన గుడ్లు, మూడు రోజులు రాగి జావ, మూడు రోజులు వేరుశనగ చిక్కీ వంటి పోషకాహారాన్ని అందజేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత వంట చేసే ఏజెన్సీలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే అన్నారు.పాఠశాల ఖాళీ స్థలాల్లో న్యూట్రీ గార్డెన్స్ పెంచాలని సూచించారు. పస్తుత ధరల కారణంగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన నిర్వహణ ఇబ్బందిగా ఉందని..ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు చార్జీలను పెం చాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారి డి.సుధీర్, డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డీఈవో కె.వాసుదేవరావు, వి.వెంకట్రాజు, రాజకుమారి, డీవైఈవో ఈవీబీఎన్.నారాయణ, డీఐ దిలీప్‌కుమార్, గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యామ్ సుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య, పి.సోమసుందర రెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : ప్రజలు మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కంబాలపేట యూపీహెచ్‌సీ పరిధిలోని నెహ్రూనగర్ గజ్జాలమ్మ తల్లి గుడి వద్ద, దానవాయిపేట యూపీహెచ్‌సీ అంబేడ్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను మంగళవారం తనిఖీ చేశారు. వైద్యాధికారులతో మాట్లాడి రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. వాతావరణం మారినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన వేడినీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.జిల్లా సర్వలెన్స్ అధికారి రాజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

- 79950 95800కు హాయ్ అని మెసేజ్ చేయాలి
- సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు
- ఇప్పటి వరకూ 380 స్వీకరణ : ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పోర్టల్‌లో సింగిల్ విండో విధానం ద్వారా వినాయక చవితి ఉత్సవ అనుమతులు సులభంగా పొందవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు.ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని ఉత్సవ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ సుమారు 380 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందన్నారు. 79950 95800 ఫోన్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపిస్తే నిరభ్యంతర ధ్రువపత్రం(ఎన్‌వోసీ) కోసం అనుసరించాల్సిన ప్రక్రియ వాట్సాప్‌లో వస్తుందన్నారు. తర్వాత ఉత్సవ కమిటీలు ganeshutsav.net వెబ్‌సైటులో వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషనుకు వెళుతుందన్నారు. ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బందితో కూడిన బృందం సదరు ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తగు రుసుం చెల్లించిన తర్వాత క్యూఆర్‌తో ఉన్న ఎన్‌వోసీ జారీ చేస్తారని తెలిపారు. ఆ కాపీని ప్రింట్ తీసి ఉత్సవ మండపంలో ప్రదర్శించాలని సూచించారు. ఉత్సవాలకు సంబంధించి కమిటీలదే పూర్తి బాధ్యత అన్నారు. విగ్రహాల ఎత్తు ఐదు అడుగులకు మించి ఉండరాదన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలనూ నిర్వహించకూడదని తెలిపారు. మండపం లోపల, బయటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మండపాల వద్ద, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఇబ్బంది కలిగించకూడదన్నారు.శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించి తీరాల్సిందేనన్నారు. అవసరమైన సందర్భాల్లో 91548 80083 వాట్సప్, 08832 441480 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.



పచ్చని కొండలపై పాల నురగలా

మెట్టలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తూర్పు కనుమల్లో ప్రకృతి సోయగాలకు కొదవ లేదు. ఊటీని తలపించే అందాలు కట్టిపడేస్తున్నాయి. తుని రూరల్ ఎర్రకోనేరు వద్ద పచ్చని కొండలపై పాల నురగలా తేలియాడతూ మంచు సోయగాలు మురిపిస్తున్నాయి. కొత్త అందాలు సంతరించుకున్న ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను పరవశింప చేస్తోంది. - తుని రూరల్

విశాఖ-విజయవాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, సెప్టెంబరు 3: వరదలల కారణంగా ఇప్పటికే మూడు రోజులుగా పలు రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో ప్రయాణికులకు కాసింత వెసులుబాటు కల్పించేందుకు మంగళవారం నుంచి విశాఖ-విజయవాడల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ రమేష్ మంగళవారం అందించిన సమాచారం మేరకు ఈ ప్రత్యేక రైలు 08581తో విశాఖ నుంచి మంగళవారం మధ్యాహ్నం 12.55కి బయలు దేరిందన్నారు. సాయంత్రం 3.14కి సామర్లకోటకు చేరుకుని తిరిగి విజయవాడకు బయలుదేరింది. రాత్రి 7.15కి విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు పట్ల ముందస్తు సమాచారం లేకపోవడంతో రైలు ఖాళీగా విజయవాడకు తరలివెళ్లింది.

గౌతమి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కాకినాడపోర్టు-లింగంపలి-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే 12737, 12738 నంబర్లు గల గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళవారం రాత్రి నుంచి దారి మళ్లిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులను సామర్లకోట రైల్వేస్టేషన్‌కు మంగళవారం రాత్రి జారీ చేశారు. భారీవర్షాల కారణంగా చేసిన ఈ మార్పుల కారణంగా కాకినాడ నుంచి బయలుదేరే గౌతమి ఎక్స్‌ప్రెస్ విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో గౌతమి ఎక్స్‌ప్రెస్ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడల మీదుగా తిరిగి సామర్లకోట చేరుకుంటుందన్నారు.



శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీపాద శ్రీవల్లభులకు
సహస్ర చామంతి పుష్పపూజ

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదవల్లభులకు చామంతి పుష్పాలతో పూజ జరిగింది. పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం విశేషపూజలు జరిగాయి. సహస్ర చామంతి పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదవల్లభుని పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్ఠానం జరిగాయి. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. భక్తులు గురుచరిత్ర, శ్రీపాదవల్లభ చరితామృత గ్రంథ సామూహిక సప్తాహ పారాయణం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.

సత్యదేవుడి హుండీలలో
భారీగా విదేశీ కరెన్సీ

● ఏటా రూ.40 లక్షల వరకు ఆదాయం

అన్నవరం, సెప్టెంబరు 3 : రత్నగిరివాసుడైన సత్యదేవుడు తెలుగుప్రజల ఆరాధ్య దైవంగానే కాకుండా విదేశీయుల తాకిడి క్రమంగా పెరుగుతూనే ఉంది. దీనికి ప్రధానంగా హుండీలలో విదేశీభక్తులు వేసే వివిధ దేశాల కరెన్సీ లభ్యమవడమే నిదర్శనం. గతంలో విదేశీ కరెన్సీ విలువ ఏడాదికి 5నుంచి ఆరులక్షలు మాత్రమే వస్తోండగా ప్రస్తుతం ఈ ఆదాయం రూ.40 లక్షలకు చేరుకుంటుంది. విదేశీ కరెన్సీలో అధిక భాగం యుఎస్ఏ డాలర్లదే కావడం గమనార్హం. తరువాత స్థానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన దిరహమ్స్, సింగపూర్, కెనడా, మలేషియా, రష్యాలున్నాయి. విదేశీయులు స్వామివారి దర్శనం అనంతరం వారి దేశ కరెన్సీను హుండీలో సమర్పించి వారి దగ్గరున్న ఇండియన్ రూపీస్‌తో ఇతర అవసరాలకు వినియోగించుకుంటారు. వీటిని దేవస్థానం ఏవిధంగా భారత కరెన్సీగా మారుస్తుంది అనే అనుమానం రావచ్చు. దేవస్థానం అధికారులు ఏ నెలకు ఆనెల హుండీలను తెరిచి సిబ్బందితో లెక్కించి యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్‌లలో రొటేషన్ విధానంలో ఒక్కోనెల ఒక్కో బ్యాంక్‌లో జమచేస్తుంటారు. హుండీల లెక్కింపు సమయంలో వచ్చిన విదేశీకరెన్సీని ఆయా బ్యాంక్‌లు స్వీకరించి ఆరోజు విదేశీకరెన్సీలో ఏదేశ కరెన్సీ విలువ ఎంతుందో అంతే మొత్తాన్ని ఇండియన్ రూపీస్‌లో లెక్కకట్టి దేవస్థానం ఖజానాకు జమచేస్తారు. తరువాత వాటిని బ్యాంక్ అధికారులు రిజర్వ్‌బ్యాంక్‌కు పంపుతారు. హుండీల లెక్కింపులో అన్నిదేశాల విదేశీ కరెన్సీల విలువ నెలకు సుమారు రూ.40లక్షల వరకు ఉంటుందని అకౌంట్ విభాగ అధికారులు పేర్కొంటున్నారు.



హుండీల ద్వారా లభించిన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

2016లో డీ మోనటైజేషన్‌లో రద్దయిన నోట్లు రూ.10లక్షలు

అన్నిరకాల నోట్లను దేవస్థానం నగదుగా మూర్చుకుంటున్న 2016లో ప్రధాని మోదీ నోట్ల రద్దు ప్రకటించిన రూ.500, రూ. 2000 నోట్లు ఇంకా హుండీలలో అక్కడక్కడా కనిపిస్తుండడం విశేషం. నోట్లు రద్దు తరువాత బ్యాంక్‌లు కొద్దికాలం వీటిని స్వీకరించినా గడువు ముగిసిన తరువాత విచ్చలవిడిగా దేశీయభక్తులు అవి బయట చెల్లుబాటుకాకపోవడంతో హుండీలలో సమర్పించేవారు. ఆ సమయంలో బ్యాంక్‌లు వీటిని తీసుకోకపోవడంతో అవి దేవస్థానం ఖజానాలో మూలుగుతున్నాయి. సుమారు రూ.10లక్షల వరకు ఆ నోట్లు దేవస్థానం లాకర్లలోనే ఉన్నాయి. దేవస్థానం అధికారుల బృందం రిజర్వ్‌బ్యాంక్ ప్రతినిధుల వద్దకు వెళ్లి వీటి గురించి ప్రస్తావించినా వారు కూడా తీసుకోకపోవడంతో దేవస్థానంలోనే ఉంచారు.

వరద బాధితుల కోసం
అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం

● 10వేల పులిహోర ప్యాకెట్లు, 40 వేల వాటర్ ప్యాకెట్లు తరలింపు



పులిహోర ప్యాకెట్ల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 3: అల్పపీడన ప్రభావం విజయవాడను అతలాకుతలం చేయడంతో అక్కడ వరదబాధితుల కోసం అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం అందించి తనవంతు పాత్ర పోషించింది. దేవస్థానం ప్రత్యేక వాహనాల ద్వారా అన్నవరంలో 10వేల పులిహోర ప్యాకెట్లను తయారు చేయించింది. దీంతోపాటుగా 40వేల వాటర్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లారు. ఈ వాహనాన్ని మంగళవారం ఉదయం ఈవో రామచంద్రమోహన్ జెండాఊపి ప్రారంభించారు. దేవస్థానం నుంచి కొందరి సిబ్బందిని ఆ వాహనాలలో పంపించి వారే నేరుగా బాధితులకు అందేలా చేయాలని ఈవో ఆదేశించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేవస్థానాల నుంచి ఆపన్నహస్తం అందించడం ఎప్పటినుంచో చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి

● అన్నవరం ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రం అందజేత

అన్నవరం, సెప్టెంబరు 3: భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి ప్రకటించిన గుర్తింపు పత్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి లభించడం అభినందనీయమని దేవస్థానం అధికారులు సిబ్బంది ఈ ఖ్యాతిని మరింత విస్తరించేందుకు కృషిచేయాలన్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ భారత ఆహార సంస్థ సూచనలతో రుచి, శుచి, నాణ్యతతో ప్రసాదం తయారీచేస్తున్నామని వారు రెండేళ్లకు ఒకసారి దీనిపై ఆడిట్‌చేసి గుర్తింపుపత్రం రెన్యువల్ చేస్తుంటారని స్వచ్ఛమైన, అమృతమైన స్వామివారి గోధుమరవ్వ ప్రసాదం తయారీలో రాజీపడబోమని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ రోహిత్, పీఆర్వో కృష్ణారావు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సత్యప్రభ స్వామిని దర్శించుకోగా వారికి ఆలయ ఈవో రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.



ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రాన్ని ఈవో, ఛైర్మన్‌లకు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

పెరుగుతున్న గోదావరి

● 2,99,814 క్యూసెక్కుల నీరు దిగువకు..

ధవళేశ్వరం, సెప్టెంబరు 3: ఉపనదులు ప్రాణహిత, మంజీర నుంచి వరద నీరు గోదావరికి చేరుతుండడంతో కాళేశ్వరంవద్ద నీటి మట్టం పెరుగుతుంది. దీని ప్రభావంతో ఎగువున భద్రాచలంవద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరద నీటి ప్రవాహాన్ని అంచనావేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను ఆర్‌క్లియర్ పొజిషన్‌లో ఉంచి గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం 7.20 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 6.20అడుగులుగా నమోదు కాగా 2,99,814 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 9లక్ష క్యూసెక్కుల వరద తరలిరావచ్చని, 11అడుగులకు పైగా నీటి మట్టం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద తెల్లవారుజామున 2గంటలకు నీటిమట్టం 25.70అడుగులుగా ఉండగా సరాసరి గంటకు 1పాయింట్ చొప్పున పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 38.50అడుగులకు చేరుకుంది. మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి 43 అడుగుల వరకు నీటిమట్టం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

రూ.18 లక్షలకే
కేజీ బంగారం అంటూ కుచ్చు టోపీ

● ఈజీ మనీ కోసం మోసపోయిన ఆర్ఎంపీ వైద్యుడు

కూనవరం, సెప్టెంబర్ 3: ఈజీ మనీ కోసం ఓ నలుగురు రూ.18లక్షలకే కేజీ బంగారం వస్తోందనే ఆశతో వారి ఉచ్చులోపడి మోసపోయిన సంఘటన కూనవరంలో చోటుచేసుకుంది. అల్లూరి జిల్లా కూనవరం మండలానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడితోపాటు మరో ముగ్గురు ఈ మోసం ఉచ్చులో పడిపోయారు. మండలంలో నివశిస్తున్న ఈ వైద్యుడి దగ్గరకు పిట్టల మందు అమ్ముకునే ఓ వ్యక్తి వచ్చాడు. కొంతసేపు ఆర్ఎంపీ వైద్యుడితో మాట్లాడాక నా దగ్గర రూ.18లక్షలకే కేజీ బంగారం ఉందని ఆ సొమ్ము ఇస్తే బంగారం ఇస్తానంటూ నమ్మించాడు. ఆ మాయమాటల్లో పడిపోయిన ఆర్ఎంపీ వైద్యుడు మరో ముగ్గురు స్నేహితులకు ఈవిషయాన్ని చెప్పాడు. అందరూ చర్చించుకుని ఎక్కువ బంగారం వస్తోందన్న ఆశతో ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఆ బంగారం బెంగుళూరులో ఉందని పిట్టల మందు అమ్ముకునే వ్యక్తి తెలిపారు. ఈ నలుగురు రెండుసార్లు బెంగుళూరు వెళ్లారు. అనంతరం బెంగుళూరు, ఆంధ్రా సరిహద్దుల్లో బంగారం తనిఖీ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. బెంగుళూరుకు చెందిన కొంతమంది వ్యక్తులు బంగారం పరిశీలించుకోవడానికి రెండు బంగారు ముక్కలు ఇచ్చారు. అవి ఒరిజినల్ కావడంతో మిగతా ఆ కేజీ బంగారం పరిశీలించకుండా తీసుకొచ్చారు. తీరా ఇంటికొచ్చాక ఆ బంగారం నకిలీ కావడంతో నిండా మోసపోయామంటూ ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు
1,600 అరటి గెలలు

రావులపాలెం, సెప్టెంబరు 3: వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు రావులపాలెం నుంచి అరటి గెలలను తరలించారు. మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆర్జేడీఎం పి.సుధాకరరావు పర్యవేక్షణలో కోనసీమ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి వి.విశాలాక్షి, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.యశ్వంతరావు రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో 1.600 కర్పూర రకం అరటి గెలలను కొనుగోలు చేశారు. మంగళవారం వాటిని లారీల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో అంబాజీపేట, ఆలమూరు ఉన్నత శ్రేణి కార్యదర్శులు ఐ.రమేష్, గోవిందరెడ్డి, సూపర్‌వైజర్లు వి.శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.



రావులపాలెం అరటి మార్కెట్‌యార్డు నుంచి విజయవాడ తుఫాన్ ప్రభావిత ప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేసిన అరటి గెలలు

యువకుడి దాడిలో
వృద్ధురాలి మృతి

తుని రూరల్, సెప్టెంబరు 3: యువకుడి దాడిలో వృద్ధురాలి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట పంచాయతీ శివారు గవరపేటలో జరిగింది. గవరపేటకు చెందిన వేగి ఆనంద్, తండ్రి నల్లబాబు పొలంలో అదే గ్రామానికి చెందిన పక్క పొలం రైతు భార్య వేగి సుబ్బలక్ష్మి(68)కి ఆనంద్‌కి మధ్య స్థలవివాదంపై ఘర్షణ చోటు చేసుకోవడంతో మంగళవారం ఆనంద్ సుబ్బలక్ష్మిపై దాడి చేయడంతో సుబ్బలక్ష్మి మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణామాచార్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకో పాలనలో వెనుదిరిగిన పరిశ్రమలను రప్పిస్తాం

● కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



మెగా దంత వైద్య శిబిరాన్ని సందర్శించి పళ్ళ సెట్టును అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనపర్తి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన సైకో పాలనతో అనేక పరిశ్రమలు తరలిపోయాయని మరికొన్ని పరిశ్రమలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకంజ వేశాయని వీటన్నిటినీ తిరిగి ఆహ్వానించి పరిశ్రమలను నెలకొల్పి అనేక మందికి ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్లో మూడు రోజులుగా నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్యశిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు ముఖ్యమంత్రితో కలిసి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు బుధవారం ప్రారంభంకానున్నాయని చెప్పారు. పొలమూరులో జరిగిన దంత వైద్య శిబిరంలో సేవలను పరిశీలించారు. రోగులకు ఉచితంగా అందించే పళ్ల సెట్లను మంత్రి అందజేశారు. నెల రోజులపాటు జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల మొత్తం వైద్య సేవలకు అంకితం కావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు. దంత వైద్య శిబిరం నిర్వహించిన జీఎస్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్ఎల్ ట్రస్టు ఎంపీ డాక్టర్ సందీప్‌ను, మంత్రి శ్రీనివాసవర్మను ఘనంగా సత్కరించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు శివరామ కృష్ణంరాజు, సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, దత్తుడు శ్రీను, పాల్గొన్నారు.

పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పనకు
రిలయన్స్‌తో ఎంవోయూ

● సమీక్షలో జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3: వర్సిటీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పన, ఇంటర్న్‌షిప్స్, పరిశోధనలు, కన్సల్టెన్సీ సేవలు అందించేందుకుగాను త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నామని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. గాడిమొగలోని రిలయన్స్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో మంగళవారం జేఎన్టీయూకే అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిలయన్స్‌లోని స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులు అందించేందుకుగాను చర్చలు జరిపామన్నారు. అనంతరం రిలయన్స్ ప్రతినిధులు తమ సంస్థలో సంభవించే సాంకేతిక అవరోధాలకు సత్వరపరిష్కారం అందించాలని కోరారు. దీనిపై వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. సమీక్షలో ఓఎస్‌డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర, సీఈ శ్రీనివాసులు, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీ కృష్ణ, చక్రవర్తి, వెంకటరెడ్డి రిలయన్స్ ప్రతినిధులు సుబ్బారావు, మురళీధర్, రెబెల్లో, ప్రసాద్, వేణుగోపాలరాజు పాల్గొన్నారు.



రిలయన్స్ ప్రతినిధులతో జేఎన్టీయూకే అధికారులు

అమలాపురంలో
క్షుద్ర పూజల కలకలం!



అమలాపురంలో క్షుద్ర పూజలు జరిగింది ఇక్కడే

అమలాపురంటౌన్, సెప్టెంబరు 3: జాతీయ రహదారిని ఆనుకుని అమలాపురం కళాశాల రోడ్డులో ఉన్న దుకాణ సముదాయం, ఇళ్ల వద్ద జరిగిన క్షుద్ర పూజలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న సందులో దారి పొడవునా గృహాలు, దుకాణాల ముందు నిమ్మకాయలు ఉంచి పసుపు, కుంకుమ చల్లి నల్లని తాళ్లు కట్టారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి ముందు క్షుద్ర పూజలు నిర్వహించినట్టు భావిస్తున్నారు. ఎర్ర రంగు నీళ్లు, సూదులతో గుచ్చిన నిమ్మకాయలు, నల్లతాడుతో బంధించిన కోడిగుడ్లను పగులకొట్టడం... ఇలా ఎన్నో చేశారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చిన తంగెళ్ల సత్యనారాయణమూర్తి, మాణిక్యాలరావు కుటుంబ సభ్యులు తమ ఇంటి ముందు క్షుద్ర పూజలు జరిగాయని, కావాలని ఎవరో చేతబడి చేసినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అమావాస్య అర్ధరాత్రి చేతబడులు చేశారనివారు ఆరోపిస్తున్నారు. తంగెళ్ల సోదరులు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ కె.క్రిష్టఫర్ తెలిపారు.

పిఠాపురంలో వ్యక్తిపై హత్యాయత్నం

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం కలకలం సృష్టించింది. పట్టణంలోని మంగాయమ్మరావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణ కొంతకాలంగా చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహిస్తున్నారు. దీని విషయంలో రెండేళ్ల క్రితం వ్యాపార భాగస్వాముల మధ్య వివాదాలు తలెత్తగా కేసులు పెట్టుకున్నారు. ఇవి కోర్టులో ఉన్నాయి. మంగళవారం ఉదయం సత్యనారాయణ సాయిబాబా గుడి సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌తో ఉండగా అతని పార్టనర్ ఎల్.భాస్కర్ అనే వ్యక్తివచ్చి పాదగయ సెంటర్ వద్ద దించమని అడిగాడు. అతనిని మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని పిఠాపురం బైపాస్‌రోడ్డు మీదుగా వెళుతుండగా శ్రీచైతన్య స్కూలు వద్దకు వచ్చేసరికి భాస్కర్ కత్తి తీసుకుని సత్యనారాయణను పొడిచి అతనివద్ద ఉన్న రూ.1.50లక్షలను తీసుకుని పరారయ్యాడు. గాయపడిన సత్యనారాయణ చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. సత్యనారాయణ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనపై సీసీ కెమేరా దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చిట్‌ఫండ్ కంపెనీ వివాదాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు.

పసలపూడిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, సెప్టెంబరు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుని పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు రాయవరం ఎస్ఐ పి.బుజ్జిబాబు మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామంలో బియ్యం అక్రమ రవాణ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 3వేల 110 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ 1లక్షా 43వేల 60 రూపాయలు ఉంటుందని, రూ.4లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన యజమాని నాగిరెడ్డి సీతారామయ్య, డ్రైవర్ బాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వరద నీరే...తాగు నీరై

● తాగునీరు లేక సింగంపల్లి గ్రామస్థుల వెతలు
● ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో నీరు సేకరిస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు కొండ వాగులు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే , అయితే మండలంలోని సింగంపల్లి గ్రామస్థులు మాత్రం తాగేందుకు మంచినీరు లేక వరద నీటిని తాగుతున్నారు. సింగంపల్లి గ్రామంలో సుమారు 600 మంది జనాభా ఉంటారు. ప్రధాన రహదారితో సంబంధం లేకుండా కాలువ ఆవల గ్రామం ఉండటంతో గ్రామంలో ప్రజలు ఏమైపోయినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఆ గ్రామ ప్రజలకు మొదటి నుంచి తాగునీటికి ఇబ్బందులే. 2017లో ఐటీడీఏ ద్వారా గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేశారు. అయితే ఆర్వో ప్లాంటు గత రెండేళ్లుగా పనిచేయట్లేదు. ఈ విషయాన్ని ప్రజలు అప్పటి అధికారులు, పాలకుల దృష్టికి తీసుకొని వెళ్లిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. దీంతో వారికి వేరే గత్యంతరం లేక సమీపంలో ఉన్న మడేరువాగు వద్ద సెలములు ఏర్పాటు చేసుకొని(వాగు సమీపంలో గొయ్యి తీసి) అక్కడ ఇంకిన నీటినే తేర్చి, గత రెండేళ్లుగా ప్రజలు తాగుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మడేరు వాగుకు వరద ప్రవహం పోటెత్తింది. దీంతో నీరు బురద, తదితర వ్యర్థాలతో పూర్తిగా కలుషితమైంది. ఆ విషయం తెలిసిన తాగునీటికి వేరే ఆస్కారం లేక వరద నీటినే గ్రామస్థులు తీసుకొని వెళ్లి మంచినీటిగా సేవిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తాత్కాలికంగా ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని లేదా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సింగంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు

ఏజెన్సీ సమాచారం

రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ



రంపచోడవరం, సెప్టెంబరు 3: రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా కె.ఆర్.కల్పశ్రీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కర్నాటకకు చెందిన ఈమె 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఇంతవరకూ ట్రైనీ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహించిన ఈమెకు రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా ఇది తొలిపోస్టింగ్. వేదమంత్రాల నడుమ సబ్‌కలెక్టరు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ముందుగా కార్యాలయ పరిపాలనాధికారి, తహశీలార్లు, కార్యాలయ సిబ్బంది కొత్త సబ్‌కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ డివిజన్లో రెవెన్యూ సేవలను పూర్తి పారదర్శకతతో అందిస్తామన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేస్ కె.దేవేంద్రుడు, పరిపాలనాధికారి ఎం.సావిత్రి, తహశీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, కె.సుబ్బారావు, బి.రాజు, రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్లు బాలాజీ, శ్రీధర్, శివ, పురోహితుడు ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టరు

రంపచోడవరం, సెప్టెంబరు 3: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాలతో కూడిన ఆహారం అందించాలని జిల్లా కలెక్టరు ఎ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఏడు మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు ఎంవీవీ సత్యనారాయణ దొర, తాతబ్బాయి దొర, పి.శ్రీనివాసరావు, ఎస్.మల్లేష్, ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, ముత్యాలరావు, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలతో గిరిజనం చనిపోకూడదు..

● లాగరాయి ఆసుపత్రిలో పీవో విచారణ



లాగరాయి ఆసుపత్రిలో దర్యాప్తు చేస్తున్న పీవో

రాజవొమ్మంగి, సెప్టెంబరు 3: డెంగీతో వ్యక్తి మృతి అనే కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. లబ్బర్తి గ్రామానికి చెందిన పొడుగు రమణ అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడని, వైద్యులు మెరుగైన వైద్యానికి రిఫర్ చేశామని చెబుతున్నా సకాలంలో వైద్యం అందకే మృతి చెందాడని, ఎక్కడికి రిఫర్ చేయలేదంటూ కుటుంబీకులు ఆరోపించారంటూ ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం వచ్చింది. ఘటనను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం కొన్ని గంటల్లోనే స్పందించారు. మంగళవారం మధ్యాహ్నం ఐటీడీఏ పీవో లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఘటనపై విచారణ చేపట్టారు. ఇక్కడి పరిస్థితులను జిల్లా కలెక్టర్‌కు వెంటనే నివేదించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి, విచారణ అధికారిగా ఏడీఎంహెచ్‌వో శిరీషను నియమించినట్లు పీవో తెలిపారు. పీవో కట్టా సింహాచలం పాత్రికేయులతో మాట్లాడుతూ డెంగీతో మృతి అని తెలిసిన వెంటనే ఆసుపత్రికి వచ్చిన కారణం మరలా ఇటువంటి మరణాలు సంభవించకూడదనే ఉద్దేశం అని, ప్రజలందరూ జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానిక ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచులు మిరియాల గణలక్ష్మి, సత్యవతి, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఉన్నారు.

మారుమూల గ్రామాల్లో రహదారుల ఏర్పాటు : పీవో

రంపచోడవరం, సెప్టెంబరు 3: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మట్లాడుతూ ఏడు మండలాల్లోని మారుమూల గ్రామాలకు లింగ్ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రతిపాదించే రోడ్లకు కల్వర్టులు, వంతెనలు కూడా పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ జి.డేవిడ్‌రాజ్, డీఈఈలు చైతన్య, గౌతమి, శ్రీనివాసరావు, రాజేంద్రబాబు, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, పి.వెంకటరమణ, వంశీ, ఉమామహేశ్వరరావు, ఆచారి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బంధం శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని నరసాపురం పీహెచ్‌సీలలో జరిగిన ఆశ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. గ్రామాలలో జ్వరపీడితులకు తప్పకుండా రక్త పరీక్షలు చేయాలన్నారు. అనంతరం ఆశాకార్యకర్తల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంశీ కుంజం, వైద్యాధికారిణి సుజిత, సీహెచ్‌వో అన్నపూర్ణ, పీహెచ్‌ఎన్ నాగమణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

● నేడు భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక?

ఎటపాక, సెప్టెంబరు 3: గోదావరి నదీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు క్రమంగా గోదావరి వరద పెరుగుతోంది. మంగళవారం ఉదయం నుంచి గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ, సాయంత్రం 6గంటలకు భద్రాచలంవద్ద గోదావరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. బుధవారం మొదటి ప్రమాదహెచ్చరిక 43 అడుగులకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు అక్కడి అధికారులు అంచ నా వేస్తున్నారు. గోదావరి పెరగడంతో వాగుల్లో వరదనీరు పోటెత్తింది. మరోవైపు వాగుల సమీపంలో లంక ప్రాంతాల్లో పత్తిసాగుచేసిన రైతులు గోదావరి వరద పెరుగుదలతో ఆందోళనలో ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 3: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫోర్ బై డ్యాం వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెలియాడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా దానిని ఒడ్డుకు తీసుకొచ్చి పోలీసులు చింతూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉంటాయని నలుపు, తెలుపు రంగు గడ్డం ఉండి మెడలో నల్లటి తాడుకు ఒక లాకెట్ కలిగి ఉండి దానికి ఇరువైపులా ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిస్తే మోతుగూడెం ఎస్ఐ జిగోపాలరావు 9492864275లో సంప్రదించాలన్నారు.

'అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలి'

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 3: మండల అభివృద్ధి పనులపై అధికారులు దృష్టిపెట్టాలని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి అన్నారు. రేఖపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మండలంలో ప్రబలుతున్న జ్వరాల నేపథ్యంలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అన్నవరం దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఈక్రమంలో సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ మాట్లాడుతూ శబరి పరివాహక ప్రాంతాలలో త్రీఫేస్ విద్యుత్ త్వరగా పునరుద్ధరించాలన్నారు కాకినాడ, రాజమండ్రి, రాజోలు, గోకవరం, పాడేరు నుంచి కూనవరం మీదుగా భద్రాచలం వెళ్లే ప్రతి బస్సు రేఖపల్లి వచ్చి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందించారు. తహశీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో పణీంద్ర మాట్లాడుతూ ఇటీవల ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి వరద క్రమంగా పెరుగుతుందని ప్రజలను అప్రమత్తం చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు ప్రజా ప్రతి నిధులకు తెలిపారు కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గిరిజనేతరుల జామాయిల్ సాగు స్వాధీనం చేసుకోండి

చింతూరు, సెప్టెంబరు 3 : చింతూరు డివిజన్ పరిధిలో పలువురు వలస ఆదివాసీలు ఆదివాసీల భూములను కౌలుకు తీసుకొని వేలాది ఎకరాల్లో జామాయిల్ సాగు చేశారని ఆదివాసీ జేఏసీ నాయకుడు జల్లి నరేష్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యంలో ఆదివాసీల భూములకోసం రూపొందించిన చట్టాలు తుంగలో తొక్కారని నరేష్ ఆరోపించారు. చింతూరు ఐటీడీఏ ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని నరేష్ ఆరోపించారు. భూములలో గిరిజనేతరులు సాగుచేసిన జామాయిలు సాగును భూ సొంతదారులైన గిరిజనులు స్వాధీనం చేసుకోవాల్సిందిగా నరేష్ సూచించారు.

నేడు బీజేపీ సభ్యత్వాల నమోదు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3: బీజేపీ నాయకుల సామూహిక సభ్యత్వాల నమోదు కార్యక్రమం బుధవారం ఉదయం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమానికి బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సభ్యత్వాల నమోదు అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ, మండల వారీగా సభ్యత్వాలు నమోదు చేయించే కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు.

ఆపన్న హస్తం

▸ విజయవాడ వరద బాధితులకు పలువురి సహాయం

▸ ఆహార పొట్లాలు, తాగునీరు, ఆర్థిక సాయం అందజేత

దివాన్‌చెరువు, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు పలువురు ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఆహార పొట్లాలు, తాగునీరు, ఆర్థిక సాయం అందజేస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు తరపున రూ.62,500 డీఈవో వాసుదేవరావుకు అందజేసినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్(అపుస్మా) నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు (నాగుమాస్టారు) మంగళవారం తెలిపారు. తాము సమావేశం నిర్వహించుకుంటున్న సమయంలో అందిన సమాచారంతో అప్పటికప్పుడు స్పందించిన తమసంఘం సభ్యులు నాయకులు ఈ మొత్తాన్ని సమకూర్చారన్నారు. కార్యక్రమంలో అపుస్మా నియోజకవర్గ అధ్యక్షుడు కన్నబాబు, కోశాధికారి ఎల్.వీరబాబు తదితరులు పాల్గొన్నారన్నారు.



దివాన్‌చెరువు: డీఈవోకు సొమ్ము అందజేస్తున్న అపుస్మా నాయకులు

మునికూడలి టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

సీతానగరం, సెప్టెంబరు 3: వరద బాధితుల సహాయార్థం మునికూడలి టీడీపీ నాయకులు రూ.25 వేల చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డ వెంకటరమణ చౌదరికి అందజేశారు. బీవీఆర్‌తోపాటు మరికొంతమంది తెలుగుదేశం నాయకులు వరద సహాయ చర్యల్లో పాల్గొనడానికి మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా మునికూడలికి చెందిన తెలుగుదేశం నాయకులు ఆయనను కలిసి చెక్కును అందజేశారు.



బీవీఆర్ చౌదరికి నగు చెక్కు అందజేస్తున మునికూడలి నాయకులు

కడియం నుంచి 7,500 ఆహార పొట్లాలు



కడియం నుంచి ఆహారపొట్లాలు తరలిస్తున్న నాయకులు

కడియం, సెప్టెంబరు 3: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్, కడియం వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్, దుళ్ల కూటమి నాయకులు కలిసి వరద బాధితులకు 5వేల ఆహార పొట్లాలు పంపించారు. కార్యక్రమంలో మల్లు పోలరాజు, వెలుగుబంటి నాని, నర్సరీ సంఘం కార్యవర్గ సభ్యులు ఉన్నారు. అలాగే స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి విజయవాడకు 2,500 ఆహార పొట్లాలు పంపినట్టు తహశీల్దారు కె.పోసిబాబు తెలిపారు. వాహనానికి ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

రాజానగరం నుంచి 4000 ఆహార పొట్లాలు

రాజానగరం, సెప్టెంబరు 3: కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు 1500 ఆహార పొట్లాలు విజయవాడ పంపించినట్టు తహశీల్దార్ ఎన్.లక్ష్మీలావణ్య తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వరద బాధితులకు వీటిని అందజేస్తామని చెప్పారు. అలాగే రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ హైవే రెస్టారెంట్ అండ్ ఫుడ్ కోర్ట్ హేబిటేట్ నుంచి 2500 వెజ్ బిర్యానీ ప్యాకెట్లు విజయవాడ తరలించారు. తాజా కూరగాయలతో స్వయంగా తయారు చేసిన బిర్యానీ ప్యాకెట్లను రాజానగరం డిప్యూటీ తహశీల్దార్ సునీతకు అందజేశారు.

పెట్రోలియం డీలర్స్ చేయూత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 3: వరద బాధితులకు జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ చేయూతనిచ్చింది. రాజమహేంద్రవరంలో స్వతంత్ర పెట్రోల్ బంకు నుంచి 5 వేల ఆహార పొట్లాలతో వెళుతున్న వాహనానికి అసోసియేషన్ పెద్దలు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో పెట్రోలియం డీలర్స్ మహేంద్రబాబు, కర్రి సూర్యనారాయణ రెడ్డి, రఘురాం, దుర్గారావు, నేమాని పట్టాభి, టీడీపీ నాయకులు జక్కంపూడి అర్జున్, ఆడారి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే బత్తుల దంపతులు

కోరుకొండ, సెప్టెంబరు 3: విజయవాడలో వరద బాధితులకు సహాయక చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అయన సతీమణి వెంకటలక్ష్మి రెండో రోజు మంగళవారం సైతం సేవలందించారు. బాధితుల కోసం స్థానిక అమ్మ కల్యాణ మండపం వద్ద స్వయంగా ఆహారాన్ని తయారు చేసి ప్యాక్ చేశారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు ఎమ్మెల్యే బత్తులను విజయవాడ 5వ వార్డుకు ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆ వార్డులోని మైత్రినగర్, జయప్రకాష్‌నగర్, సున్నం బట్టీలు, క్రీస్తు రాజాపురం, అరుణ్‌నగర్, గంగిరెద్దుల దిబ్బ ప్రాంతాల్లో పర్యటించారు. సహాయక కేంద్రాల్లో తలదాచుకుంటున్న వృద్ధులు, పిల్లలను కలిసి వారికి అవసరమైన ఆహారం, పాలు, మందులు, దుప్పట్లు, మంచినీరు పంపిణీ చేశారు. సహాయక చర్యల్లో జనసేన నాయకులు దేవన దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు, మేడిశెట్టి శివరాం, నాతిపాము దొరబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

▸ రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్

▸ పలుచోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలు

రాజానగరం, సెప్టెంబరు 3: ప్రస్తుత సీజన్‌లో ప్రజలంతా పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్ అన్నారు. మండలంలోని వెలుగుబంద గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో జ్వరపీడితులను గుర్తించి, మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించి 52 మందికి ఉచితంగా మందులు చేసినట్టు చెప్పారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, అసిస్టెంట్ భూలక్ష్మీరావు, ఏఎన్‌ఎం జె.బుజ్జి, తదితరులు సేవలందించారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు గ్రామ సచివాలయం-3 పరిధిలో పాలచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరం కేసులను సర్వే చేశారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన48 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి అవసరమైన మందులు అందించారు. డెంగ్యూ, మలేరియా కేసులు ఏమీలేవని సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వైద్య శిబిరం నిర్వహించాలి

రంగంపేట, సెప్టెంబరు 3: మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రతి రోజూ వైద్య శిబిరం నిర్వహించాలని రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన నెల వారీ ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు జ్వరాల సర్వేలు చేయడమే కాకుండా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎలాంటి అస్వస్థత కలిగినా వెంటనే పీహెచ్‌సీలో తెలియపరచాలన్నారు. ప్రసవం సమయం దగ్గరలో ఉన్న గర్భిణులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, పీహెచ్ ఎం.గంగాభవాని, వి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రాజానగరం పీహెచ్‌సీ వైద్యులు

అటవీ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు అనుమతులు

▸ ఇందుకు అకిరా మియావాకీ చక్కటి అవకాశం

▸ ఓటరు జాబితా ఇంటింటి సర్వే 38.86 శాతమే పూర్తి

▸ అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ సెప్టెంబరు 3: పర్యావరణ సమతుల్యత, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో దట్టమైన మొక్కలతో చిన్నఅడవులు సృష్టించడానికి ఉపాధిహామీ పథకం కింద అకిరా మియావాకీ ఒక చక్కటి అవకాశమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఈ-క్రాప్, ఎలక్షన్ హౌజ్‌హోల్డ్ సర్వే, రెవెన్యూ, ఆర్‌వోఆర్ మ్యుటేషన్, ఉపాధి హామీ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులుతో కలిసి ఆర్డీవో, తహశీల్దార్ ఇతర మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. వీఏవో, వీఆర్‌వో అథంటికేషన్‌పై మండల స్థాయి అధికారులతో వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జాయింట్ రెవిన్యూ ఖాతాలో ఉన్న భూమి విస్తీర్ణం సర్వే చేపట్టి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్స్, వాటి వివరాలు కేసులు వారీగా నివేదిక అందజేయాలన్నారు. జాయింట్ ఎల్‌పీకి చెందిన 31,395 రికార్డుల్లో ఇంకా పూర్తి చేయాల్సిన 28,785కి చెందిన యాక్షన్ ప్లాన్ అందించాలన్నారు. జిల్లాలో 30,06,754 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టవలసి వుండగా 2,82,579 ఎకరాల్లో (92.12శాతం) మాత్రమే పూర్తిచేశారని, మిగిలిన లక్ష్యాలు ఈ నెల 10కి పూర్తి చేయాలన్నారు. వీఏవో 2,57,006 (90.95శాతం), వీఆర్వో 2,44,529 (95.15 శాతం) అథంటిఫికేషన్ పూర్తి చేశారని, మిగిలినది రానున్న 48 గంటల్లో పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ఓటరు జాబితా ఇంటింటి సర్వేపై సమీక్ష చేస్తూ 16,24,329 ఓటర్ల గుర్తింపులో 6,31,267 (38.86శాతం) మాత్రమే పూర్తిచేయడంపై కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. ఉపాధిహామీ పథకంలో అకిరా మియావాకి కింద దట్టమైన అటవీ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేశామన్నారు. తొలి ఏడాది 780, రెండో ఏడాది 350 పని దినాలు కల్పించవచ్చని తెలిపారు. స్థలాల గుర్తింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్స్, కాలేజీలు, పంచాయతీలు, కమ్యూనిటీ లేఔట్లలో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, వాటర్ ట్యాంక్ కింద, చెరువు గట్టు ప్రాంతాల్లో ఏర్పాటుకు సానుకూలత ఉందన్నారు. జిల్లాకు 50లక్షల పనిదినాలకి 37.31 లక్షల పనిదినాలు సాధించామన్నారు. ప్రతి రోజూ జిల్లాలో 11,200 పనిదినాలు కల్పిస్తున్నారని, మరోక 700 నుంచి 800 వరకు పనిదినాలు అధికంగా ఏర్పాటు చేయగలిగితే లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో డీసీవో ఆర్.శ్రీరాములు నాయుడు, డీఎవో ఎస్.మాధవరావు, డీపీవో దాసరి రాంబాబు, సీపీవో ఎల్.అప్పలకొండ, డీఎల్‌డివో పి.వీణాదేవి, వి.శాంతా మణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో చిత్రలేఖనం, క్విజ్ పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 3: భారతదేశంలో 40 కోట్ల మందికి జీవిత బీమా రక్షణ అందిస్తూ ఎల్ఐసీ ప్రజల మన్ననలందుకుందని సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి తెలిపారు. జీవిత బీమా వారోత్స వాల సందర్భంగా మోరంపూడి జంక్షన్ వద్ద గల ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, పాటల పోటీలను నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో అన్ని వర్గాలను భాగస్వా మ్యం చేస్తామని తెలిపారు. పోటీల్లో రాజమహేంద్రవరంలోని 55 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా ప్రముఖ చిత్రకారుడు బాపి రాజు, క్విజ్ నిర్వాహకుడిగా కోదండరామ్, పాటల పోటీ న్యాయనిర్ణేతలుగా శిరీష్, సుబ్బలక్ష్మి, భానుమతి, రమాదేవి, రాజ్యం వ్యవహరించారు. కార్యక్ర మంలో మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, మేనేజర్లు ఏవీఎస్ ఆర్వీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎంవీఎస్. మూర్తి,ఎస్.గన్నెయ్య పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 3: రాజమహేంద్రవరం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థినుల స్వీయ రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్.రమాదేవి నేతృత్వంలో సదస్సు జరిగింది. దిశ పోలీస్‌స్టేషన్ సీఐ కె.మంగాదేవి, ఎస్ఐలు పి.నాగరత్నం, పి.నారాయణమ్మ, పీడీ లక్ష్మీప్రసన్న విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కెఎన్ రెహమాన్, ఎన్ఎస్ఎస్ పీవో కె.మహేశ్వరి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సమస్యలు చెప్పండి

సీతానగరం/రాజమహేంద్రవరం,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వెంకటనగరం, తొర్రేడు, కాటవరం, ములకల్లంక, జాలిమూడిలోని ముంపు ప్రాంతాలను, ఏటిగట్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు మంగళవారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ఆహారం, సురక్షిత తాగునీరు తదితర సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలిగినా డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు.

బీజేపీలో చేరికలు

అనపర్తి, సెప్టెంబరు 3: నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు మంగళవారం బీజేపీలో చేరారు. రామవరంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో వారికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన వారిలో బిక్కవోలు, ఊలపల్లి, సుభద్రంపేట సర్పంచ్‌లు సరెళ్ల సుమలత, బందారు రమ్య, పూడి సాయితాతారావు, ఊలపల్లి, బిక్కవోలు ఎంపీటీసీలు పెంకే మంగయ్యమ్మ, జి.భాగ్యలక్ష్మితో బాటు పలు గ్రామాలకు చెందిన వార్డు మెంబర్లతో కలిసి సుమారు 50మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 3: జేసీ ఎస్ చిన్నరాముడును మాజీ ఎమ్మె ల్సీ ఆదిరెడ్డి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ చాంబర్‌కు వచ్చిన ఆదిరెడ్డి అప్పారావు జేసీకి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.అనంతరం పలు అంశాలపై చర్చించారు.

గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 3: ప్రముఖ కవి ఎస్ఆర్ పృథ్వీ రచించిన తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు రాష్ట్రంలో పలు గ్రంథాలయాలకు బహుకరించారు. కందుకూరి వీరేశలింగం పుస్తక కళాశాల గ్రంథాలయానికి మంగళవారం సుమారు 25 గ్రంథాలు అందించారు. గత మూడు నెలలుగా గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల, సీతంపేట గ్రంథాలయం, ఇన్నీసుపేట గ్రంథాలయం, కాకినాడ జిల్లా గ్రంథాలయాలకు పలు గ్రంథాలు అందజేసినట్టు తెలిపారు.

రామకృష్ణకు పీహెచ్‌డీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 3: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో పరిశోధన పూర్తి చేసిన తోట రామకృష్ణకు పీహెచ్‌డీ పట్టాను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. ఆనందరావు పట్నాయక్ కథలు-పరిశీలన అనే అంశంపై మోగంటి సుధామయి, తరపట్ల సత్యనారాయణ పర్యవేక్షణలో రామకృష్ణ పరిశోధన చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తెలుగుశాఖ కోర్స్ కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, సహాయాచార్యులు తరపట్ల సత్యనారాయణ అభినందించారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

సీతానగం, సెప్టెంబరు 3: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ నంద కిషోర్ ఆదేశించారు. మంగళవారం ఆయన సీతానగరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా విక్రయాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సారా వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. సారా విక్రయదారులకు చట్టాలపై అవగాహన కలిగించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ డి.రామ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరోపియన్ వర్శిటీల్లో కోర్సులపై అవగాహన

రాజానగరం, సెప్టెంబరు 3: యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యా అవకాశాలు అనే అంశంపై గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గైట్ ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ విశ్వవిద్యాలయం గ్రూపు లీడర్ ఆర్‌డబ్ల్యూటీహెచ్ అంతర్జాతీయ అకాడమీలోని భారత కార్యాలయం డైరెక్టర్ సందీప్ పి.పాటిల్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అందించే మాస్టర్ డిగ్రీ గురించి ఆర్‌డబ్ల్యూటీహెచ్ అఖిల్ వివరించారు. హాకింగ్ విశ్వవిద్యాలయంతో జీజీయూ ఎంవోయూ చేసుకుందని చెప్పారు. ఆర్కేన్ వర్శిటీలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన బ్యాంకు రుణాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టీవీ ప్రసాద్, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

బిక్కవోలు, సెప్టెంబరు 3: శ్రావణమాసం ఆఖరి మంగళవారం కావడంతో బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం భక్తులతో పోటెత్తింది. కాల, సర్ప, రజ, కుజ దోష పరిహారార్థం భక్తులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేశారు. స్థానిక గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యస్వామి అన్నదాన సత్రంలో కూడా భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.

మహిళల ఉత్పత్తుల ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు కృషి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి

కడియం, సెప్టెంబర్ 3: మహిళలు తయారు చేసే ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసేందుకు డీఆర్‌డీఏ తరఫున ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. కడియం మహిళా సమాఖ్య భవనంలో యూనియన్ బ్యాంక్ - రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌ఎస్‌ఈటీఐ) మహిళలకు ఇస్తున్న అగరబత్తీల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఐసీఏఆర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డీవీఎస్ రాజుతో కలిసి ఆయన పరిశీలించారు. శిక్షణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్లోరికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ భారతి కశ్యప్, యువన్ వెండర్ రవీందర్ పరాస్ ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, ఫ్లోరికల్చరిస్ట్ లక్ష్మిపతి, యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి



టీడీపీ కార్యకర్తలు, విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు3 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తలకు, వివిధ స్కూల్స్, కళాశాలలో చదువుకుంటున్న 9 మంది విద్యార్థులకు ఫీజుల నిమిత్తం భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందించారు. విజయవాడలో వరద బాదిత ప్రజలను ఆదుకునేందుకు రాజమహేంద్రవరం ప్రజలు ముందుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, అబ్దుల్, మరుకుర్తి రవియాదవ్, మళ్ళ వెంకట్రాజు, మొకమాటి సత్యనారాయణ, కందికొండ అనంత్, బేసరి చిన్ని, మిస్కా రాము, కేవీ శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన తాటాకిల్లు.. తప్పిన ప్రాణాపాయం

గోకవరం, సెప్టెంబరు 3: మండలంలోని రంపయర్రంపాలెంలో ఓ పేద కుటుంబం ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకుంది. జగ్గంపేట మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన బండి శ్రీను, వెంకటలక్ష్మి దంపతులు, వారి ఇద్దరి కుమారులు, ఓ కుమార్తెతో సుమారు పదేళ్లుగా రంపయర్రంపాలెంలోని ఓ తాటాకింటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వారు ఉంటున్న ఇల్లు సోమవారం అర్థరాత్రి హఠాత్తుగా నేలకూలింది. ఆ సమయంలో శ్రీను కుటుంబం ఇంట్లోనే నిద్రిస్తున్నారు. లోపలున్న మంచం, ఇతర సామాగ్రిపై పాక పడింది. ఈ క్రమంలో శ్రీను.. భార్య, పిల్లలను బయటకు తీసుకొచ్చాడు. మంచం, ఎత్తులో ఉన్న ఇతర సామాగ్రి లేకపోయి ఉంటే పాక తమపై పడి అందరం ప్రాణాలను కోల్పోయేవారమని బాధితులు విలపించారు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో చంద్రకాంత పరిశీలించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రూ.10 లక్షల విలువైన మందులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం నుంచి మంగళవారం రూ.10 లక్షల విలువైన మెడిసిన్స్‌ను ఒక ప్రత్యేక వాహనంలో పంపించారు. డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి. నాగమణి మందులతో వెళుతున్న వాహనాన్ని పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ తరపున రాజమహేంద్రవరం టౌన్ అసోసియేషన్ నాయకులు మందులు సేకరించినట్టు అధ్యక్షుడు పిల్లా బాల తెలిపారు.



విజయవాడలో వరద బాధితుల సమస్యలు వింటున్న మంత్రులు కందుల దుర్గేష్,ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల



కొవ్వూరు నుంచి వెళుతున్న ఆహార వ్యాన్లకు సిగ్నల్ ఇస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఆహో.. ఏమి స్పందన

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రార్థించే పెదవులకన్నా.. సాయం చేసే చేతులు మిన్న.. ప్రస్తుతం జిల్లా వాసులంతా ఈ నానుడి పాటిస్తున్నారు. విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి అనేక మంది స్వచ్ఛందంగా సాయం చేస్తున్నారు.తొలిరోజు సోమవారం 16 వాహనాల్లో ఆహారం తరలించగా..రెండోరోజు మంగళవారం జిల్లా నుంచి 58 వాహనాల్లో 1,09,500 ఫుడ్ ప్యాకెట్లు పంపినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం భోజనం కోసం 53 వేల మందికి 20 వాహనాల్లో ఆహారాన్ని పంపించామన్నారు.రాత్రి భోజనం కోసం 56,500 ఫుడ్ ప్యాకెట్లు పంపించినట్టు చెప్పారు. ఉదయం భోజనం కోసం తిరుమల స్కూల్స్ 10 వేల ప్యాకెట్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా 12,500 ప్యాకెట్లు, గైట్ కళాశాల ద్వారా 1500, జీఎస్ఎల్ ద్వారా 2500, సినిమా అసోసియేషన్ తరపున 1000, ఓఎన్‌జీసీ తరపున 5000,ఇస్కాన్ 5000, రాజమహేంద్రవరం కార్పొరేషన్ కాంట్రాక్టర్లు 1000 ఫుడ్ ప్యాకెట్లు,50 వేల బిస్కట్ ప్యాకెట్లు పంపించారు.రాత్రి భోజనం కోసం ఆదిత్య కాలేజీ 500 ప్యాకెట్లు, ప్రైవేట్ పాఠశాలలు 5000, రాజమ హేంద్రవరం ఆర్డీవో ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ల ద్వారా 20,000 ప్యాకెట్లు, ఐఎంఏ అసోసియేషన్ 2000, పెట్రోలు బంకుల అసోసియేషన్ 1500, లెనోరా డెంటల్ కాలేజీ, ఇండస్ట్రీస్ 1500, విమెన్ కాలేజీ 1000, హార్లిక్స్ ఫ్యాక్టరీ ద్వారా 7000 పంపిణీ చేశారు. ఎస్ఆర్‌కే కేటరింగ్ 7000 ప్యాకెట్లు, హోటల్ శ్రీకన్య 10 వేల ప్యాకెట్లు, కొవ్వూరుకు చెందిన సీహెచ్ వెంకటరమణ 5000, ప్రసాద్ కేటరింగ్ 5000 ప్యాకెట్లు పంపిణీ చేశారు.



మేం సైతం : ఎమ్మెల్యేలు మద్దిపాటి, ముప్పిడి సాయం

నేనూ..వండేస్తా : ఎమ్మెల్యే బత్తుల



మా వంతుగా : విజయవాడ తరలిస్తున్న మందులు



పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆహార వ్యాన్



మేమంతా సిద్ధం వెళ్లిపోవడానికి!

ఫ్యాన్ కింద తీవ్ర ఉక్కబోత

- ఓటమి తరువాత కానరాని నేతలు
- ఇతర పార్టీల వైపు కేడర్ చూపు
- పార్టీ పిలిచినా స్పందించని వైనం
- 7 అసెంబ్లీల్లో ఇదే పరిస్థితి
- యువజన విభాగానికి రాజా
- జిల్లా అధ్యక్షుడిగా వేణు
- తూర్పున ఖాళీ అవుతున్న వైసీపీ
- మళ్లీ పుంజుకుంటున్న కాంగ్రెస్



ఆగండి..ఆగండి.. మేమూ వచ్చేస్తాం..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత జిల్లాలో వైసీపీ పరిస్థితి చుక్కానిలేని నావలా తయారైంది. మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లన్నీ టీడీపీ కూటమి కైవసం చేసుకోవడంతో వైసీపీ కుదేలైంది. పైగా భారీ ఓట్ల తేడాతో వైసీపీ నేతలు ఓడిపోయారు. దీంతో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వైసీపీలో ఉంటే ఇబ్బందులేననే ఆలోచనతో క్యాడర్ ఉంది.ఈ నేపథ్యంలో పలువురు నేతలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పుంజుకోవడం కోసం వైసీపీ వర్గాలపై కన్నేసింది. చాలా కాలం నుంచి కాంగ్రెస్ అనుచరులుగా ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన నేతలంతా మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. టీడీపీ,జనసేన, బీజేపీలోకి రావడానికి పైరవీలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా సాగుతున్నా వైసీపీ కేడర్‌ను కాపాడుకునే పని చేయడం లేదు. అధికారంలో ఉండగా వైసీపీ కేడర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇవాళ అనేక మంది వైసీపీని వదిలేయడానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం కేడర్ అంతా ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లాలో పలువురు వైసీపీని వదిలేసి ఇతర పార్టీల పంచన చేరుతున్నారు. కూటమికి చెందిన ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ నిడదవోలులో గ్రీన్ సిగ్నల్ ఇస్తే చాలా మంది పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. గోపాలపురం నియోజకవర్గంలో వైసీపీ పూర్తిగా చతికిలపడింది. మాజీ మంత్రి తానేటి వనిత అప్పుడప్పుడు అలా కనిపించడం తప్ప కేడర్‌ను నడిపించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొవ్వూరులో కింగ్ మేకర్‌గా ఉన్న రాజీవ్‌కృష్ణ ఇటీవల యాక్టివ్‌గా కనిపించడంలేదు.అక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజల్లోకి రావ డం లేదు.రాజమహేంద్రవరం సిటీలో మాజీ ఎంపీ భరత్ అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు పెట్టి, అధికార పార్టీని ఆడిపోసుకోవడానికే పరిమితం అవుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరిస్థితి కూడా అంతే. ఎన్నికల ముందు రామచంద్రపురం నుంచి ఇక్కడకు వలస వచ్చిన వేణు ఓటమి తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. రాజానగరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన వైపు నిలబడడానికి కూడా పెద్దగా కేడర్ ఆసక్తి చూపడం లేదు. పైగా ఆయన జిల్లా అధ్యక్ష పదవిని వదిలేసి, రాష్ట్ర వైసీపీ యువజన విభాగం అధ్యక్ష పదవిని చేపట్టారు.దీంతో ఆయనకు ఇక్కడ బాధ్యత తగ్గినట్టే. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి పరామర్శలకే పరిమితం అయ్యారు. నేతల పరిస్థితి ఇలా ఉంటే జిల్లా లో వైసీపీ నేతల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయి.ఇదిలా ఉండగా జిల్లా అధ్యక్ష పదవిని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు కట్టబెట్టారు. అయితే ఆయన కోనసీమ జిల్లాకు చెందిన నేత కావడంతో కేడర్‌లో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం సిటీ ప్రెసిడెంట్‌గా మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను నియమించారు. ఇదిలా ఉండగా పార్టీ ఫిరాయించడానికి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ,జడ్పీటీసీలు, కౌన్సిలర్లు సిద్ధంగా ఉండడం గమనార్హం.

ఫీవర్..ఫియర్



- పెరుగుతున్న జ్వర పీడితులు
- ప్రజలను వీడని వైరల్ జ్వరాలు
- శిబిరాలు పెట్టినా ఫలితం నిల్
- ఫీవర్ సర్వేపై పెదవి విరుపు
- జీజీహెచ్‌లో 53 జ్వరం కేసులు
- పిల్లలకూ సోకుతున్న వైనం
- 'లెక్కలేని' ప్రైవేట్ ఆసుపత్రులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఆరోగ్యపరంగా, ఆర్థికంగానూ పీల్చిపిప్పి చేస్తున్నాయి. సామాన్యులు, దిగువ మధ్యతరగతి ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. పెద్దలతో పాటు పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. సాధారణ వైరల్‌తో పాటు డెంగీ, మలేరియా జ్వరాలు నమోదవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వరబాధితులతో నిండిపోతున్నాయి. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితర ఆరోగ్య సిబ్బంది చేసిన ఫీవర్ సర్వేపై ప్రజల్లో అనేక అనుమానాలు ఏర్పడుతున్నాయి.లెక్క తప్పుతున్నదనే ఆరోపణలున్నాయి.

సర్వేల్లో.. ఫీవర్ జీరో..

రాజమహేంద్రవరం అర్బన్, కొవ్వూరు ప్రాంతాల్లో 15 చోట్ల మంగళవారం ఫీవర్ సర్వేలు నిర్వహించామని వైద్య, ఆరోగ్యశాఖ ప్రకటించింది. కొవ్వూరులోని శ్రీరామకాలనీ, గోష్పాదక్షేత్రం, రాజమహేంద్రవరం సిటీలో వెంకటేశ్వరనగర్, సుభాష్‌నగర్, శేషయ్యమెట్ట, నెహ్రూనగర్ గజ్జలమ్మ టెంపుల్ స్ట్రీట్, ఇన్నీసుపేట, మునిసిపల్ కల్యాణ మండపం, బ్రహ్మంగారి గుడి వీధి, మల్లిన నగర్ పోస్టల్ కాలనీ వంటి ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు వెల్లడించారు. ఇలా ప్రతిరోజూ ఆరోగ్య సిబ్బంది ఫీవర్‌సర్వే చేస్తున్నారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఈ నెల 2వ తేదీన ఆరోగ్య సిబ్బంది 51,519 కుటుంబాల్లో లక్షా 53 వేల 506 మందిని సర్వే చేశారు. వీరిలో 2,816 మందిని ఓపీగా గుర్తించగా 234 అనుమానిత కేసులు నమోదయ్యాయి. వీరిలో 99 మందికి డెంగీ పరీక్షలు చేస్తే నెగెటివ్ వచ్చింది.మరో 159 మందికి మలేరియా జ్వరాలపై పరీక్షలు చేయగా నెగెటివ్‌గా తేలింది.ఈ లెక్కన ఎవరికి జ్వరం అనేదే లేదని తేల్చారు. మరి ప్రజలు జ్వరాలతో పెద్దసంఖ్యలో ఆసుపత్రుల్లో ఎందుకు చేరుతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

జీజీహెచ్ జ్వరాల ఓపీ 53..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు జ్వరపీడితులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పిల్లల్లోనూ జ్వరాలు కనిపిస్తున్నాయి. మంగళవారం జీజీహెచ్‌లో పెద్దలకు సంబంధించిన జ్వరాల ఓపీ 53గా నమోదు కావడం గమనార్హం.అధికారులు చెబుతున్నదాని ప్రకారం ఇక్కడ ఇన్‌పేషెంట్లుగా 9 మంది చికిత్స పొందుతున్నారు. ఇద్దరు చిన్నారులు జ్వరాలతో ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. కానీ వాస్తవాలు మరోలా కనిపిస్తున్నాయి. ఆసుపత్రిలో బెడ్స్ చాలకపోవడంతో ఎక్కువ మందికి ఓపీ విభాగంలో వైద్య సేవలు అందించి మందులు రాసి ఇళ్లకు పంపుతున్నారనే ప్రచారం సాగుతోంది. సగటున 10-12 మందిని మాత్రమే ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నారని, దీనికోసం పాతవారికి డిశ్చార్జ్ రాస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక జ్వరాలతో ప్రజలు పెద్దసంఖ్యలో వస్తున్నా జీజీహెచ్‌లో ఫీవర్‌వార్డు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. జీజీహెచ్‌కు వైరల్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలతో వస్తున్నవారికి జీజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు వైద్యసేవలందిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో 'లెక్కలేనట్టే'..

జ్వరాలకు సంబంధించిన సమాచారం అంతేఇంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తున్నా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లోని లెక్కలపై ఎలాంటి స్పష్టత ఉండడంలేదు. ఆర్ఎంపీలు, పీఎంపీల నుంచి లెక్కలు రావడంలేదు. జ్వరాల ఓపీ ఎంత ? వాటిలో వైరల్ ఎన్ని ? డెంగ్యూ, మలేరియా అనుమానితుల సంఖ్య ఎంత అనేదానిపై ప్రైవేట్ ఆసుపత్రులు జిల్లా అధికారులకు పూర్తి సమగ్ర సమాచారం ఇవ్వడంలేదనే అనుమానాలున్నాయి. దీంతో వైరల్, డెంగీ, మలేరియా, తదితర జ్వరాల లెక్కలపై పూర్తి లెక్క తేలడంలేదు.దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

మిడ్‌డే మీల్స్ రుచిగా ఉండాలి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, సెప్టెంబరు 3 : ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహించిన జిల్లాస్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చూడాలన్నారు. బడి భోజనం మెనూలో మార్పులు ఉంటే చర్చించి నివేదిక అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం అందజేస్తుందని తెలిపారు. వారానికి 5 రోజులు ఉడికించిన గుడ్లు, మూడు రోజులు రాగి జావ, మూడు రోజులు వేరుశనగ చిక్కీ వంటి పోషకాహారాన్ని అందజేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత వంట చేసే ఏజెన్సీలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే అన్నారు.పాఠశాల ఖాళీ స్థలాల్లో న్యూట్రీ గార్డెన్స్ పెంచాలని సూచించారు. పస్తుత ధరల కారణంగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన నిర్వహణ ఇబ్బందిగా ఉందని..ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు చార్జీలను పెం చాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారి డి.సుధీర్, డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డీఈవో కె.వాసుదేవరావు, వి.వెంకట్రాజు, రాజకుమారి, డీవైఈవో ఈవీబీఎన్.నారాయణ, డీఐ దిలీప్‌కుమార్, గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యామ్ సుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య, పి. సోమసుందర రెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3 : ప్రజలు మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కంబాలపేట యూపీహెచ్‌సీ పరిధిలోని నెహ్రూనగర్ గజ్జాలమ్మ తల్లి గుడి వద్ద, దానవాయిపేట యూపీహెచ్‌సీ అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను మంగళవారం తనిఖీ చేశారు. వైద్యాధికారులతో మాట్లాడి రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. వాతావరణం మారినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన వేడినీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.జిల్లా సర్వలెన్స్ అధికారి రాజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

- 79950 95800కు హాయ్ అని మెసేజ్ చేయాలి
- సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు
- ఇప్పటి వరకూ 380 స్వీకరణ : ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పోర్టల్‌లో సింగిల్ విండో విధానం ద్వారా వినాయక చవితి ఉత్సవ అనుమతులు సులభంగా పొందవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు.ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని ఉత్సవ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ సుమారు 380 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందన్నారు. 79950 95800 ఫోన్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపిస్తే నిరభ్యంతర ధ్రువపత్రం(ఎన్‌వోసీ) కోసం అనుసరించాల్సిన ప్రక్రియ వాట్సాప్‌లో వస్తుందన్నారు. తర్వాత ఉత్సవ కమిటీలు ganeshutsav.net వెబ్‌సైటులో వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషనుకు వెళుతుందన్నారు. ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బందితో కూడిన బృందం సదరు ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తగు రుసుం చెల్లించిన తర్వాత క్యూఆర్‌తో ఉన్న ఎన్‌వోసీ జారీ చేస్తారని తెలిపారు. ఆ కాపీని ప్రింట్ తీసి ఉత్సవ మండపంలో ప్రదర్శించాలని సూచించారు. ఉత్సవాలకు సంబంధించి కమిటీలదే పూర్తి బాధ్యత అన్నారు. విగ్రహాల ఎత్తు ఐదు అడుగులకు మించి ఉండరాదన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలనూ నిర్వహించకూడదని తెలిపారు. మండపం లోపల, బయటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మండపాల వద్ద, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఇబ్బంది కలిగించకూడదన్నారు.శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించి తీరాల్సిందేనన్నారు. అవసరమైన సందర్భాల్లో 91548 80083 వాట్సప్, 08832 441480 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బదిలీల.. బండారం!



ఎడాపెడా సిఫారసు లేఖలు

- బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఈ నెల 15 వరకు గడువు
- క్యూకడుతున్న ఉద్యోగులు
- గత 20 రోజులుగా ఇదే సీన్
- డిమాండ్ ఉన్న సీటుకు రేటు
- అయినా తగ్గని వైనం
- ఎక్సయిజ్‌కు మహా డిమాండ్
- వైసీపీ లేఖలకు వత్తాసు
- మారని అధికారుల తీరు

బదిలీల జాతర ఆరంభమైంది..ఆ సీటు నాకు కావాలంటే.. నాకు కావాలంటూ ఉద్యోగులు పోటీ పడుతున్నారు... డిమాండ్‌ను బట్టి సీటులో కూర్చునేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు.. ముందస్తుగా ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రయత్నాలు చేస్తున్నారు.. మీరు ఒక లెటర్ ఇవ్వండి సార్.. మిగిలిందంతా మేం చూసుకుంటామంటూ ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.. అదీ కుదరకపోతే సీటు కొనుగోలుకు సిద్ధపడుతున్నారు.. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వంలోనూ అక్కడక్కడా వైసీపీ నాయకుల సిఫారసులకు అధికారులు ప్రాధాన్యమివ్వడం కొసమెరుపు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసీపీ అక్రమాలకు కొమ్ముకాస్తూ ప్రజాస్వామ్యానికే ఇబ్బందిగా పరిణమించిన అధికారులను ఆయా పోస్టుల నుంచి తప్పించింది. తొలుతగా రాష్ట్ర స్థాయి అధికారులతో మొదలుపెట్టి జిల్లా స్థాయిలోనూ బదిలీలు జరిగాయి. తర్వాత మండల ఆ క్రింది స్థాయి వంతు వచ్చింది. దీంతో అసలైన బదిలీల గోల మొదలైంది. ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు రెక్కలొచ్చాయి. కలెక్టర్ వద్దకు వస్తున్న ఉద్యోగుల్లో ఎవరి చేతిలో చూసినా ఓ కవరు ఉండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

బదిలీలకు 11 రోజులే గడువు

బదిలీలకు అనుమతి ఇచ్చిన వెంటనే ఎవరి ప్రయత్నాలు వారు ఆరంభించారు. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు 'ఖర్చు' పెడుతున్నారు. తమకు లేఖ ఇస్తే తర్వాత సంగతి తాము చూసుకుంటామని చెప్పడంతో ప్రజాప్రతినిధులు ఒకరికంటే ఎక్కువ మందికి సిఫారసు లేఖలు ఇస్తున్నారు. గత 15 రోజుల నుంచీ ఇదో జాతర మాదిరిగా జరుగుతోంది. గత నెల 31వ తేదీ వరకు బదిలీల దరఖాస్తులకు ముగింపు గడువు ఇచ్చారు. అయితే అధికారుల అభ్యర్థన మేరకు మరో 15 రోజులు పెంచుతూ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీల దరఖాస్తు గడువుకు ఇంకా 11 రోజులే మిగిలి ఉండడంతో సిఫారసు లేఖలు ముమ్మరమయ్యాయి. సిఫారసు లేఖలు తీసుకున్న వాళ్లు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్నారు. అయితే వైసీపీ వేధింపులకు తాళలేక లేక వేరే కారణాలతో లూప్‌లైనులో ఉన్న వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని కొందరు ఉద్యోగులు కోరుతున్నారు. లూప్‌లైనులో ఉన్నవారు, నిజాయితీగా పని చేసే వాళ్లు డబ్బు ఖర్చుచేసి సిఫారసు లేఖలు సంపాదించడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందట్లో సడేమియాగా వైసీపీ అనుకూల వర్గం వాళ్లు కూడా సిఫారసు లేఖలు సమర్పించి కావాల్సిన పోస్టింగ్ తెచ్చుకొనే పనిలో ఉన్నారనే వాదన ఉంది. డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్‌పై ఆరోపణల నేపథ్యంలో రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు తిరస్కరించినప్పటికీ వైసీపీ నేతల ప్రోద్బలంతో బదిలీని నిలుపుదల చేసుకుని కొనసాగుతుండడమే ఇందుకు నిదర్శనం.

జీవో ఏం చెబుతుందంటే?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బదిలీలకు అనుమతినిస్తూ గత నెల 17న జీవో ఎంఎస్ నెం.75ని విడుదల చేసింది. రెవెన్యూ(భూ పరిపాలన), పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్, సెర్ప్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, జీపీడబ్ల్యూపీ అండ్ వీ ఎస్‌డబ్ల్యుఎస్(సచివాలయాలు), మైనింగ్, అన్ని శాఖల్లోని ఇంజనీరింగ్ సిబ్బంది, దేవాదాయ, రవాణా,ఈఎఫ్ఎస్అండ్‌టీ, పరిశ్రమలు,ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, వాణిజ్య పన్నులు, అబ్కారీ శా ఖల్లో బదిలీలకు అనుమతి ఇచ్చారు. బదిలీలు ఆగస్టు 19 నుంచి సెప్టెంబరు 15వ తేదీలోపుగా పూర్తి చేయాలని పేర్కొన్నా రు. ఎక్సైజ్ శాఖకు సెప్టెంబరు 5 నుంచి 15 వర కూ సమయమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలో బదిలీల విధి విధానాలు స్పష్టంగా పేర్కొన్నారు. ఆయా శాఖలు అం తర్గతంగా కమిటీలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వడపోత తర్వాత కాంపిటెంట్ అథారిటీకి సిఫారసు చేయాలని జీవోలోని 5(3) పేరా చెబుతోంది. బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని 5(4)లో పేర్కొన్నారు. ఒకవేళ అవకతవకలు జరిగాయని తేలితే ఆయా శాఖాధిపతులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కానీ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, రవాణా, ఎనర్జీ, మైనింగ్ శాఖలో ఈ లేఖల గోల ఎక్కువగా ఉందని చెబుతున్నారు. బదిలీలు చేయించుకోడానికి కొందరు ఖర్చు చేస్తుంటే..మరి కొందరు బదిలీని ఆపుకోడానికి తంటాలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు వచ్చే నెల 5 నుంచి తలుపులు తెరుచుకోనుండడంతో ఇప్పటి నుంచే ఆ శాఖ ఉద్యోగులు 'ప్రయత్నాలు' మొదలు పెట్టి నట్టు చెబుతున్నారు. ఆ శాఖకు ప్రభుత్వం పునర్ వైభవం తీసుకొస్తుండడంతో ఎంత 'ఖర్చుకైనా సిద్ధమయ్యారట. ఇప్పటికే లేఖలు పుచ్చుకున్న వారిని ఆరా తీస్తే దుడ్డు సర్దుబాటుచేసుకొనే పనిలో తలమునకలయ్యారట.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఇసుక లారీలతో రోడ్డు అస్తవ్యస్తం

కానూరు-పెండ్యాల రోడ్డులో రైతుల ధర్నా



కానూరు-పెండ్యాల రోడ్డులో ధర్నా చేస్తున్న రైతులు

పెరవలి, సెప్టెంబరు 3: పెండ్యాల ఇసుక ర్యాంపునకు వెళ్లే లారీల వల్ల రోడ్డు పూర్తిగా పాడైపోయి అస్తవ్యస్తంగా మారిందని కానూరు-పెండ్యాల రోడ్డులో రైతులు ధర్నా నిర్వహించారు. నిత్యం అనేక లారీలు ఈ రోడ్డు వెంబడి వెళుతుండటంతో రోడ్డు దిగబడిపోయి తాము పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వర్షం వస్తే ట్రాక్టర్లు, మోటారుసైకిళ్లు వెళ్లేందుకు వీలుండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కొద్ది సేపు లారీలను ఆపి వేసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గారపాటి నరేంద్ర, గారపాటి శ్రీను, వాకలపూడి వెంకటేశ్వరరావు, బొప్పన వెంకటేశ్వరరావు, నాగరాజు, ఏసు, సాంబయ్య పాల్గొన్నారు.

'సమాజాభివృద్ధికి వాసవీ క్లబ్ కృషి'

కొవ్వూరు, సెప్టెంబరు 3: సమాజ అభివృద్ధిలో వాసవిక్లబ్ తనవంతు కృషి చేస్తోందని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. రవిచంద్రన్ అధికారిక పర్యటన సందర్భంగా కొవ్వూరు అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్ అధ్యక్షతన ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ హైస్కూల్లో 10 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు, పాతవూరులోని ప్రాథమిక పాఠశాలకు వాటర్‌కూలర్ అందజేశారు. ఆరికిరేవుల, దొమ్మేరు రహదారుల్లో స్వాగత ద్వారాలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మద్దుల సత్యనారాయణ, గ్రంధి ప్రవీణ్, మద్దుల సోమరాజు, వలివేటి ప్రసాద్, పలుకూరి రామారావు, నాళం శ్రీనివాస్, రాఘవ రామాకాంత్ పాల్గొన్నారు.

కొవ్వూరులో అన్న క్యాంటీన్ తనిఖీ



క్యాంటీన్‌లో ఆహార నాణ్యత అడిగి తెలుసుకుంటున్న ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, సెప్టెంబరు 3: కొవ్వూరులోని అన్న క్యాంటీన్‌ను ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు మంగళవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. టిఫిన్, భోజనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, గెల్లా సురేష్, ఎరుబండి వెంకట్రావు, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

తాళ్లపూడి, సెప్టెంబరు 3: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద మంగళవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ హరిక మాట్లాడుతూ నూడిల్స్, పానీపూరీలు తినొద్దని, ఇంట్లో చేసుకునే ఆహారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నిర్దేశించిన ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలని చెప్పారు.

అధిక పోషకాలున్న ఆహారం తీసుకోవాలి

పెరవలి, సెప్టెంబరు 3: అధిక పోషకాలున్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగు పడుతుందని సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా నల్లాకుల వారి పాలెంలో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సరైన ఆహారం తీసుకోని కారణంగా అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని, ప్రతిఒక్కరూ బయట ఆహార పదార్థాలు మాని ఇంటిలో వండిన పదార్థాలు తినాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను, హెచ్‌ఎం శారదాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే నడిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీరా సత్యవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజిని పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దమ్మెన్ను గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పిల్లలకు, తల్లులకు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎల్ బాలసరస్వతి, కూటమి నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

8 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తాళ్లపూడి, సెప్టెంబరు 3: సారా బట్టీలపై దాడులు నిర్వహించి 8 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మండలంలోని సూరయ్యపేట సరిహద్దులోని తాడిపూడి ఎత్తిపోతల కాలువ గట్టు వద్ద భూమిలో పాతిపెట్టిన 40 పీపాల్లో ఉన్న బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

వైసీపీ నాయకులు జనసేనలో చేరిక

నల్లజర్ల, సెప్టెంబరు 3: ఆవపాడు వైసీపీ నాయకుడు పసుపులేటి బాలాజీతోపాటు పలువురు వార్డు మెంబర్లు జనసేనలోకి చేరినట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేనపై అభిమానంతో సుమారు 50మంది పార్టీలో చేరినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అచ్యుత పెద రామారావు, ధనేష్ తదితరులు పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు అందించాలి

నల్లజర్ల, సెప్టెంబరు 3: పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని బీఎల్‌వోలు మంగళవారం తహశీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీఆర్వో మూర్తి, వీఆర్‌ఏ సర్దార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఉత్పత్తుల ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు కృషి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి

కడియం, సెప్టెంబర్ 3: మహిళలు తయారు చేసే ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసేందుకు డీఆర్‌డీఏ తరపున ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తి తెలిపారు. కడియం మహిళా సమాఖ్య భవనంలో యూనియన్ బ్యాంక్ - రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌ఎస్‌ఈటీఐ) మహిళలకు ఇస్తున్న అగరబత్తీల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఐసీఏఆర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డీవీఎస్ రాజుతో కలిసి ఆయన పరిశీలించారు. శిక్షణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్లోరికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ భారతి కశ్యప్, యువన్ వెండర్ రవీందర్ పరాస్ ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, ఫ్లోరికల్చరిస్ట్ లక్ష్మిపతి, యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

యూరోపియన్ వర్శిటీల్లో కోర్సులపై అవగాహన

రాజానగరం, సెప్టెంబరు 3: యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యా అవకాశాలు అనే అంశంపై గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గైట్ ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ విశ్వవిద్యాలయం గ్రూపు లీడర్ ఆర్‌డబ్ల్యూటీహెచ్ అంతర్జాతీయ అకాడమీలోని భారత కార్యాలయం డైరెక్టర్ సందీప్ పి.పాటిల్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అందించే మాస్టర్ డిగ్రీ గురించి ఆర్‌డబ్ల్యూటీహెచ్ అఖిల్ వివరించారు. హాకింగ్ విశ్వ విద్యాలయంతో జీజీయూ ఎంవోయూ చేసుకుందని చెప్పారు. ఆర్కేన్ వర్శిటీలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన బ్యాంకు రుణాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టీవీ ప్రసాద్, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సభ్యత్వాల నమోదు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 3: బీజేపీ నాయకుల సామూహిక సభ్యత్వాల నమోదు కార్యక్రమం బుధవారం ఉదయం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమానికి బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సభ్యత్వాల నమోదు అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ, మండల వారీగా సభ్యత్వాలు నమోదు చేయించే కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు.

ఆపన్న హస్తం

- విజయవాడ వరద బాధితులకు పలువురి సహాయం
- ఆహార పొట్లాలు, తాగునీరు, ఆర్థిక సాయం అందజేత

కొవ్వూరు, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు 9 వేల ఆహార పొట్లాలు, 20 వేల వాటర్‌బాటిల్స్, 10 వేల వాటర్ ప్యాకెట్లను మంగళవారం తరలించారు. పంగిడి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆహార పొట్లాలున్న వ్యాన్‌కు జెండా ఊపారు. రెవెన్యూ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, త్రివేణి గ్లాస్ ఇండస్ట్రీస్-2, బొల్లిన శివనాగేంద్రల సంయుక్త సహకారంతో తయారుచేసిన 8500 ఆహారపొట్లాలు, 20 వేల వాటర్‌బాటిల్స్, 10 వేల వాటర్ ప్యాకెట్స్ సిద్ధం చేసిన వాహనాలను పంగిడి నుంచి విజయవాడ తరలించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టడానికి ఆయన విజయవాడ వెళ్లారు. అక్కడ కృష్ణలంక రణధీర్‌నగర్‌లో పర్యటించి బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అనంతరం రణధీర్‌నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పొట్రు సిద్ధూ, ఆళ్ల హరిబాబు, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో ఆహార పొట్లాల తరలింపు

వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంటు అసోసియేషన్(అపుస్మా) కొవ్వూరు జోన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాల ఫుడ్ ప్యాకెట్‌లను మంగళవారం విజయవాడ పంపించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వాసుదేవరావు ఆధ్వర్యంలో రూ. 2.30 లక్షల విలువైన 5 వేల ఆహార పొట్లాలు, 10 వేల వాటర్‌ప్యాకెట్‌లను ప్రత్యేక వాహనంలో విజయవాడ తరలించారు. కార్యక్రమంలో డీఈవోతోపాటు అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌రెడ్డి, ముద్రగడ రవిచంద్ర, కొవ్వూరు జోన్ అధ్యక్షుడు వీవీ అనీష్, వెంకటరత్నం, తిమోతిబాబు, వలియవీడు నెల్సన్ ఆంటోని, స్వర్ణ భారతి రాజు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన పారిశుధ్య కార్మికులు

విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు కొవ్వూరు మున్సిపాల్టీ నుంచి పారిశుధ్య కార్మికులు మంగళవారం తరలివెళ్లారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించడానికి కొవ్వూరు మున్సిపాల్టీ నుంచి 30 పారిశుధ్య కార్మికులు, నలుగురు శానిటరీ మేస్త్రీలు, నలుగురు శానిటరి సెక్రటరీలు, 1 ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఏఈలు, 1 టీపీవో, ట్రాక్టరుపై పారిశుధ్య పనిముట్లు, సున్నం, బ్లీచింగ్ తరలించారు. వాటర్ ట్యాంకర్‌తోపాటు డ్రైవరు, అసిస్టెంట్‌ను విజయవాడ పంపించారు.

ఊనగట్ల, బ్రాహ్మణగూడెం నుంచి..

చాగల్లు, సెప్టెంబరు 3: మండలంలో ఊనగట్ల నుంచి టీడీపీ నాయకుడు బొల్లిన శివనాగేంద్ర ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్, బ్రాహ్మణగూడెం నుంచి రైస్ మిల్లర్స్, టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు సమకూర్చారు. వీటిని విజయవాడ తరలించడానికి సిద్ధం చేసిన వ్యాన్‌కు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కారింకి సత్యనారాయణ, వీరమల్లు శ్రీను, కామన మురళీ, మనెల్లి నాని, దొంగ రామక్రిష్ణ, గారపాటి బాబురావు, సుంకవల్లి రమేష్, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి పాల్గొన్నారు.



కొవ్వూరు నుంచి అపుస్మా ప్రతినిధులు తరలిస్తున్న ఆహారం

ఆపన్నులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాల పురం, సెప్టెంబరు 3: ఆపన్నులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఇటీవల భారీ వర్షాలకు విజయవాడలో జలమయమైన 21వ డివిజన్‌లో బాధితులకు ఆయన ఆహారం, తాగునీరు, కొవ్వొత్తులు మంగళవారం పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు వెళ్లి సేవలందించినట్టు చెప్పారు. సోమవారం రాత్రి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు అనంతరం 5వేల ఆహార పొట్లాలతో విజయ వాడ చేరుకున్నట్టు చెప్పారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదే శాలతో గోపాల పురం మండలం నుంచి విజయవా డలో బాధితులకు పంపేందుకు 2500 ఆహార పొట్లాలు సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి తహశీ ల్దార్ కె.ప్రదీప్, డీటీ ఎస్.కృష్ణ తెలిపారు.



నిడదవోలు నుంచి వ్యాన్ పంపుతున్న రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



కొవ్వూరు నుంచి విజయవాడ వెళ్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

గోదావరి రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

నిడదవోలు, సెప్టెంబరు 3: వరద బాధితులు పది వేల మందికి గోదావరి రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆహారం అందించినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబూరావు తెలిపారు. నిడదవోలులోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు వద్ద నుంచి విజయవాడకు వాహనం ద్వారా ఆహారం పంపించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో దూరుపూడి శ్రీనివాస్, పోలదాసు శ్రీనివాస్, రాంబాబు, తహశీల్దార్ పి.నాగరాజు నాయక్ తదితర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో..

దేవరపల్లి, సెప్టెంబరు 3: రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 2500 ఆహార పొట్లాలను విజయవాడ పంపినట్టు తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆహారపొట్లాలు పంపే వ్యాన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు అనీత, శేషు, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లజర్ల నుంచి జనసేన ఆధ్వర్యంలో..

నల్లజర్ల, సెప్టెంబరు 3: నల్లజర్ల నుంచి వరద బాధితులకు 3వేల వాటర్ ప్యాకెట్స్, 200 పులిహోర పొట్లాలను వ్యాన్‌పై విజయవాడ తరలించారు. జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యంత్రపాటి రాజు, ఇజ్రోతు సత్తిబాబు, రుద్ర శ్రీను, సెందిల్ కుమారి, ఉన్నమట్ల సత్య, తలంశెట్టి దుర్గాప్రసాద్, వరుణ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వరద బాధితులకు అందించేందుకు రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 2500 ఆహార పొట్లాలు సిద్ధం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆశితోష్ శ్రీవాస్తవ విచ్చేసి భోజనాల తయారీ, విజయవాడ తరలించేందుకు ఏర్పాట్లు పరిశీలించారు.ఆయన వెంట తహశీల్దార్ కృష్ణారావు, వీఆర్వో మూర్తి ఉన్నారు.



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బత్తుల సతీమణి వెంకటలక్ష్మి



దేవరపల్లిలో నుంచి ఆహార పొట్లాల వ్యాన్‌ను ప్రారంభిస్తున్న తహశీల్దార్



నల్లజర్ల నుంచి ఆహార పొట్లాలు తరలిస్తున్న నాయకులు

ఉద్యోగ కాలపరిమితి 62 ఏళ్లకు పెంచాలి

- పలుచోట్ల ఆశావర్కర్ల నిరసన కార్యక్రమాలు

దేవరపల్లి, సెప్టెంబరు 3: తమ ఉద్యోగ కాలపరిమితి 62 ఏళ్లకు పెంచాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) పిలుపు మేరకు మంగళవారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా యాదవోలు, గౌరీపట్నం, దేవర పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కే.భారతి, సరోజిని మాట్లాడుతూ ఆశావర్కర్లు ఒప్పందం చేసుకున్న జీతాలు వెంటనే ఇవ్వాలని జీవో విడుదల చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ గ్రూప్ ఇన్సూరెన్స్, మెటర్నరీ లీవ్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పీవీ.సీత, ఎస్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



తాళ్లపూడిలో వైద్యాధికారి హారికాగుప్తాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఒప్పంద జీవోలు విడుదల చేసే వరకూ రిటైర్మెంట్లు ఆపాలని, మహిళల రక్షణకు చట్టం చేయాలని, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హారికాగుప్తాకు అందజేశారు. కార్యక్రమంలో కె.సుధారాణి, ఎ.రా ఘవ, విజయకుమారి, పోసమ్మ, మణికుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లుతోపాటు మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలలు జరిగాయి. వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు కె.పోశమ్మ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని, మహిళల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సైకో పాలనలో వెనుదిరిగిన పరిశ్రమలను రప్పిస్తాం

- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

అనపర్తి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన సైకో పాలనతో అనేక పరిశ్రమలు తరలిపోయాయని మరికొన్ని పరిశ్రమలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకంజ వేశాయని వీటన్నిటిని తిరిగి ఆహ్వానించి పరిశ్రమలను నెలకొల్పి అనేక మందికి ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్లో మూడు రోజులుగా నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు ముఖ్యమంత్రితో కలిసి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు బుధవారం ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఇదిలా ఉండగా పొలమూరులో జరిగిన దంత వైద్య శిబిరంలో సేవలను పరిశీలించారు. అలాగే రోగులకు ఉచితంగా అందించే పళ్ల సెట్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. నెల రోజుల పాటు జీఎస్‌ఎల్ దంత వైద్య కళాశాల మొత్తం వైద్య సేవలకు అంకితం కావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డు అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు. దంత వైద్య శిబిరం నిర్వహించిన జీఎస్‌ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎస్‌ఎల్ ట్రస్టు ఎంపీ డాక్టర్ సందీప్‌ను, మంత్రి శ్రీనివాసవర్మను ఘనంగా సత్కరించారు.



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బీజేపీలో చేరికలు

అనపర్తి నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు బీజేపీలో చేరారు. రామవరంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో వారికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన వారిలో బిక్కవోలు, ఊలపల్లి, సుభద్రంపేట సర్పంచ్‌లు సరెళ్ల సుమలత, బండారు రమ్య, పూడి సాయితాతారావు, ఊలపల్లి, బిక్కవోలు ఎంపీటీసీలు పెంకే మంగయ్యమ్మ, జి.భాగ్యలక్ష్మితో బాటు పలు గ్రామాలకు చెందిన వార్డు మెంబర్లతో కలిసి సుమారు 50మంది బీజేపీలో చేరారు.

అటవీ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు

ప్రత్యేక అనుమతులు

- ఇందుకు అకిరా మియావాకీ చక్కటి అవకాశం
- ఓటరు జాబితా ఇంటింటి సర్వే 38.86శాతమే పూర్తి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ సెప్టెంబరు 3: పర్యావరణ సమతుల్యత, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో దట్టమైన మొక్క లతో చిన్నఅడవులు సృష్టించడానికి ఉపాధిహామీ పథకం కింద అకిరా మియావాకీ ఒక చక్కటి అవకాశమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఈ-క్రాప్, ఎలక్షన్ హౌజ్‌హోల్డ్ సర్వే, రెవెన్యూ, ఆర్‌వోఆర్ మ్యుటేషన్, ఉపాధి హామీ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులతో కలిసి ఆర్డీవో, తహశీల్దార్ ఇతర మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. వీఏవో, వీఆర్‌వో అథంటికేషన్‌పై మండల స్థాయి అధికారులతో వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జాయింట్ రెవిన్యూ ఖాతాలో ఉన్న భూమి విస్తీర్ణం సర్వే చేపట్టి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్స్, వాటి వివరాలు కేసులు వారీగా నివేదిక అందజేయాలన్నారు. జాయింట్ ఎల్‌పీకి చెందిన 31,395 రికార్డుల్లో ఇంకా పూర్తి చేయాల్సిన 28,785కి చెందిన యాక్షన్ ప్లాన్ అందించాలన్నారు. జిల్లాలో 30,06,754 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టవలసి వుండగా 2,82,579 ఎకరాల్లో (92.12శాతం) మాత్రమే పూర్తిచేశారని, మిగిలిన లక్ష్యాలు ఈ నెల 10కి పూర్తి చేయాలన్నారు. వీఏవో 2,57,006 (90.95శాతం), వీఆర్వో 2,44,529 (95.15 శాతం) అథంటిఫికేషన్ పూర్తి చేశారని, మిగిలినది రానున్న 48 గంటల్లో పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ఓటరు జాబితా ఇంటింటి సర్వేపై సమీక్ష చేస్తూ 16,24,329 ఓటర్లు గుర్తిం పులో 6,31,267 (38.86శాతం) మాత్రమే పూర్తిచేయడంపై కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. ఉపాధిహామీ పథకంలో అకిరా మియావాకి కింద దట్టమైన అటవీ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేశామన్నారు. తొలి ఏడాది 780, రెండో ఏడాది 350 పని దినాలు కల్పించవచ్చని తెలిపారు. స్థలాల గుర్తింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్స్ కాలేజీలు, పంచాయతీలు, కమ్యూనిటీ లేఔట్లలో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలా లు, వాటర్ ట్యాంక్ కింద, చెరువు గట్టు ప్రాంతాల్లో ఏర్పాటుకు సానుకూలత ఉందన్నారు. జిల్లాకు 50లక్షల పనిదినాలకి 37.31 లక్షల పనిదినాలు సాధించామన్నారు. ప్రతి రోజూ జిల్లాలో 11,200 పనిదినాలు కల్పిస్తున్నారని, మరోక 700 నుంచి 800 వరకు పనిదినాలు అధికంగా ఏర్పాటు చేయగలిగితే లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో డీసీవో ఆర్.శ్రీరాములు నాయుడు, డీఏవో ఎస్.మాధవరావు, డీపీవో దాసరి రాంబాబు, సీపీవో ఎల్.అప్పలకొండ, డీఎల్‌డివో పి.వీణాదేవి, వి.శాంతామణి తదితరులు పాల్గొన్నారు.

2,99,814 క్యూసెక్కుల నీరు దిగువకు..



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 3: ఉపనదులు ప్రాణహిత, మంజీర నుంచి వరద నీరు గోదావరికి చేరుతుండడంతో కాళేశ్వరం వద్ద నీటి మట్టం పెరుగుతుంది. దీని ప్రభావంతో ఎగువున భద్రాచలం వద్ద నీటి మట్టం వేగంగా పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరద నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను ఆర్‌క్లియర్ పొజిషన్‌లో ఉంచి గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం 7.20అడుగులుగా ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 6.20అడుగులుగా నమోదు కాగా 2,99,814 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 9లక్ష క్యూసెక్కుల వరద తరలిరావచ్చని, 11అడుగులకు పైగా నీటి మట్టం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద తెల్లవారుజామున 2గంటలకు నీటి మట్టం 25.70అడుగులుగా ఉండగా సరాసరి గంటకు 1పాయింట్ చొప్పున పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 38.50అడుగులకు చేరుకుంది. మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి 43 అడుగుల వరకు నీటి మట్టం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్ర్కీన్ 1	సరిపోదా శనివారం
వై.స్ర్కీన్ 2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డిమాట్ కాలనీ
రాధాకృష్ణ	తంగలన్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్